SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 191 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 20 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

## వాట్సాప్‌లోనే జీహెచ్‌ఎంసీ సేవలు!

- కొత్తగా 9 రకాల పౌర సేవలు అందుబాటులోకి
- మీసేవ చాట్‌బాట్ ద్వారా సులభంగా దరఖాస్తు
- మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో డిజిటల్ విప్లవం

2




## వీధికుక్కలను తరలించాల్సిందే!

- గత ఆదేశాలు అమలు చేయాల్సిందే
- ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు
- ప్రతీ జిల్లాలో పూర్తిస్థాయి బర్త్‌కంట్రోల్
- స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లలో కుక్కలు లేకుండా చేయాలి
- సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు

4



## దేశంలో ఆర్థిక తుఫాన్

- కేంద్ర ఆర్థిక విధానాలే ఈ దుస్థితికి కారణం..
- రెండు సార్లు ఇంధన ధరల పెంపు
- రాహుల్ సంచలన వ్యాఖ్యలు

4



# పాలమూరు పనుల్లో వేగం పెంచండి!

**భూ సేకరణను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి**

## పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వద్దు

### అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

ప్రతిష్ఠాత్మక పాలమూరుఉ రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తూ, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో సీఎం ఈ దిశానిర్దేశం చేశారు.

2



## పుష్కరాల ఎఫెక్ట్.. కేబినెట్‌కు బ్రేక్?

- 21 సమావేశం వాయిదా..
- 23న యాదాద్రిలో భేటీకి ప్లాన్?
- బాసర సరస్వతీ అంత్య పుష్కరాల నేపథ్యంలో ప్రభుత్వ యోచన
- మేడారం తరహాలో యాదగిరిగుట్టలోనే కీలక నిర్ణయాలకు సీఎం వ్యూహం

2






# శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణతోనే సుస్థిర ప్రగతి

**తెలంగాణ విజన్-2047 దిశగా ప్రణాళికలు**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

> రాష్ట్రంలోని కోర్ అర్బన్, పెరి అర్బన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్లు.. ఈ మూడింటినీ ఒకేలా, అదీ పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా సరికొత్తగా మార్చబోతున్నారు. భవిష్యత్తు అవసరాల కోసం తెలంగాణ ప్రభుత్వం వేసిన ఈ భారీ స్కెచ్ వెనుక 'క్యూర్, స్యూర్, రేర్' అనే వినూత్న సూత్రం దాగి ఉంది. ఈ రహస్యాన్ని న్యూఢిల్లీ వేదికగా దేశ ప్రతినిధుల ముందు విప్పారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు. తెలంగాణ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని సుస్థిర ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

**సమయం న్యూస్, న్యూఢిల్లీ:** తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా, సుస్థిర, సమగ్ర, పర్యావరణహిత అభివృద్ధి కోసం ప్రభు త్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చే శారు. రాష్ట్ర ప్రగతి కోసం ప్రభుత్వం 'క్యూర్, స్యూర్, రేర్' అనే వినూత్న అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు వివరించారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల 'స్వచ్ఛ భారత్ మిషన్–అర్బన్ 2.0' జాతీయ సమీక్షా సమావేశానికి తెలంగాణ తరఫున డిప్యూటీ సీఎం హాజరయ్యారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేసే లక్ష్యంతో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సర్క్యులర్ ఎకానమీ దిశగా చేపడుతున్న కార్యక్రమాలను ఆయన దేశ ప్రతినిధులకు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకు మాత్రమే పరిమితం కాదని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. అది వాతావరణ మార్పుల నియంత్రణ, పర్యావరణ సుస్థిరత, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో

మిగతా 2 లో

- బయో ఎరువులు, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం
- స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమావేశంలో డిప్యూటీ సీఎం వెల్లడి
- 4-వే సోర్స్ సెగ్రిగేషన్‌తో వికేంద్రీకృత ప్రాసెసింగ్
- 9,596 ఎలక్ట్రిక్ ఆటోలతో పర్యావరణ హిత రవాణా
- జపాన్ మోడల్‌లో బండరావిర్యాల, సిద్దాపూర్‌లో ఎకో టౌన్లు



3

## కాలంతో పాటు జర్నలిస్టులు మారాలి!

- డిజిటల్ యుగంలో ఆధునిక సాంకేతికతే ఆయుధం
- ఏఐ, సోషల్ మీడియా సవాళ్లపై అవగాహన పెంచుకోవాలి
- జర్నలిస్టులకు డిజిటల్ తరగతులు నిర్వహించాలి
- మీడియా అకాడమీ సమావేశంలో సీనియర్ల అభిప్రాయం

# సముద్ర తీరం, మత్స్య సంపదా మనదే!

- మత్స్యకారుల హక్కులు కాపాడతాం
- సబ్సీడీపై 200 మెకనైజ్డ్ బోట్లు
- సీవీడ్ సాగుతో మత్స్యకార మహిళలకూ ఉపాధి అవకాశాలు
- నీటి వనరుల్లో చేపల సాగు చేసుకునే అధికారం మత్స్యకారులదే
- మత్స్యకారుల సేవలో భాగంగా రూ.262 కోట్ల పంపిణీ
- ప్రజా ప్రభుత్వానిది సంక్షేమం - గొడ్డలి పార్టీది ఫేక్ ప్రచారం
- మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

5



## ప్రైవేట్ ఆసుపత్రులకు 919 కోట్ల విడుదల

- ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు బకాయిల చెల్లింపులు పూర్తి
- 785 ఆసుపత్రుల ఖాతాల్లోకి నేరుగా నిధుల జమ
- ఇప్పటి వరకు రూ.5,556 కోట్లు విడుదల
- ఆరోగ్య సేవల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి

5

## రాష్ట్ర జనాభాలో బీసీలదే ఆధిక్యం

- రాష్ట్ర జనాభాలో యాభై శాతానికి పైగా బీసీలు
- పురుషుల కంటే మహిళల సంఖ్య అధికం
- జిల్లాల వారీగా కులాల ప్రాబల్యంపై ఆసక్తికర గణాంకాలు

5






## ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు

**31 లోపు పోర్టల్‌లో ఉద్యోగుల వివరాలు నమోదు**

**తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం**

**హైదరాబాద్, మే 19:** తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. ఫైనాన్స్ శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి. భార్య, భర్త, పిల్లలు, ఆధారపడిన కుటుంబ సభ్యుల వివరాలు కూడా నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఈ సమాచారం భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, క్యాష్‌లెస్ చికిత్స వంటి ప్రయోజనాల అమలుకు ఉపయోగ పడనుంది. అన్ని శాఖల అధికారులు ఉద్యోగుల వివరాలను పోర్టల్‌లో మే 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోపు సమాచారం నమోదు చేయని పక్షంలో భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న వైద్య పథకాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త విధానాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త హెల్త్ స్కీమ్‌తో ఉద్యోగులు, పెన్షనర్లు అత్యవసర వైద్య సేవలను సులభంగా పొందుతారని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## సబ్సిడీపై పచ్చిరొట్ట, జిప్సం

**పచ్చిరొట్ట విత్తనాలకు 50 శాతం రాయితీ**

**క్షార భూముల పునరుద్ధరణకు 90 శాతం సబ్సిడీపై జిప్సం**

**'రైతు నేస్తం' వేదికగా మంత్రి తుమ్మల వెల్లడి**



**హైదరాబాద్, మే 19:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు పంట దిగుబడుల్లో కీలకపాత్ర పోషించే భూసార ఆరోగ్య పరిరక్షణ, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు, 90 శాతం సబ్సిడీపై జిప్సం ఎరువులను అందిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో నిర్వహించిన "రైతు నేస్తం" 92వ ఎపిసోడ్ కార్యక్రమంలో రాష్ట్రంలోని సుమారు 1,600 వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యంతో రైతులు, వ్యవసాయ అధికారులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంపొందించడానికి జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పంటలు ఎంతో దోహదపడతా యన్నారు. గత వానాకాలంఉ2025లో 0.87 లక్షల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను రూ.61.27 కోట్ల సబ్సిడీతో 1,89,395 మంది రైతులకు పంపిణీ చేశామని, తద్వారా 7.05 లక్షల ఎకరాల్లో సాగు జరిగిందని తెలిపారు. ప్రస్తుత వానాకాలంఉ2026లో రూ.113.27 కోట్ల సబ్సిడీతో 1.39 లక్షల క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేసి, 11.22 లక్షల ఎకరాల్లో సాగు చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలోని చౌడు, క్షార ప్రభావిత భూముల పునరుద్ధరణ కోసం "సాయిల్ హెల్త్ అండ్ ఫెర్టిలిటీ" పథకం కింద 90 శాతం సబ్సిడీపై జిప్సం అందిస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో 11,456 మెట్రిక్ టన్నుల జిప్సం పంపిణీకి ప్రణాళిక రూపొందించామని, ఇప్పటికే 10 జిల్లాల్లో 3,523 మెట్రిక్ టన్నుల జిప్సం సిద్ధంగా ఉంచామని చెప్పారు. వీటిపై క్షేత్రస్థాయిలో ఏఈఓలు, ఎంఏఓలు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. అంతకుముందు వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి రైతులకు పలు సాంకేతిక వివరాలను అందించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి ఖమ్మం జిల్లా రఘునాథపల్లిలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న మహేష్, జిప్సం వాడకంతో లాభాలు గడించిన సంగారెడ్డి జిల్లా రంజోల్ గ్రామానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి తమ అనుభవాలను పంచుకున్నారు. అలాగే పచ్చిరొట్ట పంటల ద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గించిన సిద్దిపేట జిల్లా శనిగరం గ్రామానికి చెందిన మహేందర్, నిజామాబాద్ జిల్లా ఆలూరుకు చెందిన సూర్యరెడ్డి తమ విజయగాథలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్రమోహన్, సంచాలకులు బి. గోపి, ఉద్యానవన శాఖ సంచాలకులు యాస్మిన్ భాష, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.

# శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణతోనే సుస్థిర ప్రగతి

మొదటి పేజీ తరువాయి

ముడిపడి ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన 'ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026' దేశ వ్యర్థాల నిర్వహణలో కీలక మార్పులకు దారితీస్తున్నాయన్నారు. సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా 4-వే సోర్స్ సెగ్రిగేషన్ (నాలుగు రకాలుగా చెత్త వేరు చేయడం), వికేంద్రీకృత ప్రాసెసింగ్, పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, క్యూఆర్ కోడ్ ఆధారిత పర్యవేక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ నిబంధనలు రాకముందే పలు ముందస్తు చర్యలు చేపట్టిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. కోర్ అర్బన్ ప్రాంతాల్లో కార్బన్ ఉద్గారాలను తగ్గించేందుకు దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెట్టే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఇవి 4-వే సోర్స్ సెగ్రిగేషన్‌కు అనుకూలంగా రూపొందించబడ్డాయని, క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను నిరంతరం పర్యవేక్షిస్తామని వివరించారు. ల్యాండ్‌ఫిల్ ప్రాంతాలకు కనీస స్థాయిలో వ్యర్థాలు చేరేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంప్ యార్డ్ సమస్యకు దీర్ఘకాలిక పర్యావరణ పరిష్కారం కనుగొనేందుకు ఐఐటీ బాంబే సాంకేతిక సహకారం, సలహాలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అలాగే ఆటోనగర్ డంప్ సైట్‌లో 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 22 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నామని, ఇప్పటికే 30 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఇక్కడ సేకరించిన భూమిని భవిష్యత్తులో పార్కులు, క్రీడా ప్రాంగణాలు, ప్రజా ప్రయోజన మౌలిక సదుపాయాలుగా మారుస్తామన్నారు. జపాన్ దేశంలోని కిటాక్యుషు నగర అభివృద్ధి నమూనా ఆధారంగా బండరావిర్యాల, సిద్దాపూర్ ప్రాంతాల్లో ఎకో టౌన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించామని, ఇది తెలంగాణ సర్క్యులర్ ఎకానమీ ప్రయాణంలో మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి భారత్‌ను 30-35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న కేంద్ర లక్ష్యంలో, తెలంగాణ తనవంతుగా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధనతో కీలక పాత్ర పోషిస్తుందని భట్టి పేర్కొన్నారు.




### పాఠశాలల్లోనే పరిశుభ్రత పాఠాలు

పరిశుభ్రత అనేది కేవలం నగరాల రూపురేఖలకు సంబంధించింది కాదని, అది ప్రజారోగ్యం, మానవ గౌరవంతో కూడుకున్నదని ఉప ముఖ్యమంత్రి అన్నారు. వ్యర్థాల నిర్వహణను ఒక ఆర్థిక విలువను సృష్టించే ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. జపాన్ తరహాలోనే మన దేశంలో కూడా ఒకటో తరగతి నుంచే పాఠశాలల్లో పరిశుభ్రత, వ్యర్థాల వేర్పాటు, పర్యావరణ బాధ్యత వంటి అంశాలను ఆచరణాత్మకంగా బోధించే విధానాన్ని అన్ని రాష్ట్రాలూ పరిశీలించాలని ఆయన సూచించారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు, కేంద్ర కార్యదర్శి శ్రీనివాస్ కటికితల, స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ రూపా మిశ్రాతో పాటు తెలంగాణ రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మానిక్ రాజ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, వివిధ రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పాలమూరు పనుల్లో వేగం పెంచండి!

- యుద్ధప్రాతిపదికన భూ సేకరణ పూర్తి చేయాలి
- పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వద్దు
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం



**హైదరాబాద్, మే 19:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఎమ్ సీ ఆర్ మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు ప్రాంత అభివృద్ధిలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుందని, కాబట్టి దీని పనులను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, భూసేకరణ పరిస్థితులు, నిధుల విడుదల తదితర అంశాలపై ఈ భేటీలో విస్తృతంగా చర్చించారు. ప్రతి ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులు, బాధితులకు సరైన సమయంలో పరిహారం అందేలా చూడాలని, భూసేకరణ నిధుల విషయంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిధుల కొరతతో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. పెండింగ్ లో ఉన్న బిల్లుల చెల్లింపుల విషయంలో కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పనులు ఆగిపోకుండా అవసరమైన నిధులను విడుదల చేస్తామని తెలిపారు. ప్రాజెక్టుల పూర్తి విషయంలో నిర్లక్ష్యం చేసినా, ఆలస్యం చేసినా ఏమాత్రం సహించబోమని అధికారులను హెచ్చరించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు రైతుల భవిష్యత్తును మార్చే శక్తి కలిగి ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాల పరిస్థితి కూడా మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ రంగానికి ఇది కీలక మలుపుగా మారే అవకాశం ఉన్నందున, జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్రంలో సాగునీటి వసతుల విస్తరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఈ సమావేశం ద్వారా స్పష్టమైంది. ఈ భేటీలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వాట్సాప్‌లోనే జీహెచ్‌ఎంసీ సేవలు!

- కొత్తగా 9 రకాల పౌర సేవలు అందుబాటులోకి
- మీసేవ చాట్‌బాట్ ద్వారా సులభంగా దరఖాస్తు
- ఐటీ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో డిజిటల్ విప్లవం
- 8096958096 నంబర్‌తో క్షణాల్లో పనులు

**హైదరాబాద్, మే 19:** హైదరాబాద్‌లోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన పలు పౌర సేవలను కొత్తగా మీ సేవ వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత సౌకర్యం, అందుబాటు, పారదర్శకత కల్పించే దిశగా ఈ సేవలను విస్తరించినట్లు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం కమిషనర్ తెలిపారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీసేవ ద్వారా పౌర సేవలను మరింతగా తీర్చిదిద్దుతున్నారు. గతేడాది నవంబర్ 18న ప్రారంభమైన ఈ వాట్సాప్ డిజిటల్ ఛానల్‌లో కొత్తగా 9 సేవలను చేర్చారు. ప్రాపర్టీ అసెస్‌మెంట్ రివిజన్, జనన ధ్రువీకరణ సవరణ, మరణ ధ్రువీకరణ సవరణ, ఇంటి దగ్గర పుట్టిన (బర్త్ హోమ్), చనిపోయిన (డెత్ హోమ్) వారి వివరాల నమోదును ఇందులో చేర్చారు. వీటితో పాటు ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ, ఆస్తి పేరు మార్పు, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు, ట్రేడ్ లైసెన్స్ నూతనీకరణ సేవలను ఇకపై వాట్సాప్ మీసేవలో సులభంగా పొందవచ్చు. ఈ సేవలు పొందేందుకు పౌరులు ముందుగా 8096958096 నంబర్‌ను మొబైల్‌లో 'మీసేవ తెలంగాణ' పేరుతో సేవ్ చేసుకోవాలి. అనంతరం వాట్సాప్‌లో ఆ నంబర్‌కు 'హాయ్' అని సందేశం పంపాలి. అవసరమైన సేవ పేరు టైప్ చేసి, మెనూలో కనిపించే 'ఓపెన్ సర్వీస్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అక్కడ ఫారంలో అడిగిన వివరాలు నింపి, అవసరమైన చెల్లింపు పూర్తిచేస్తే దరఖాస్తు వెంటనే నమోదవుతుంది. వాట్సాప్ ఆధారిత మీసేవ వేదికకు ప్రారంభం నుంచి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ప్రభుత్వం వెల్లడించింది. జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పోలీస్ చలాన్, విద్యుత్ బిల్లులు, బీఐఈ ఫలితాల సేవలను ప్రజలు ఇప్పటికే ఎక్కువగా వినియోగిస్తున్నారు. రోజువారీ పరిపాలన సేవలకు వాట్సాప్‌పై ప్రజల ఆధారపడటం పెరుగుతోందని, పౌరులకు సులభమైన అనుభవం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

# పుష్కరాల ఎఫెక్ట్.. కేబినెట్‌కు బ్రేక్?

**21 సమావేశం వాయిదా..**

**23న యాదాద్రిలో భేటీకి ప్లాన్?**

**బాసర సరస్వతీ అంత్య పుష్కరాల నేపథ్యంలో ప్రభుత్వ యోచన**

**మేడారం తరహాలో యాదగిరిగుట్టలోనే కీలక నిర్ణయాలకు సీఎం వ్యూహం**



**హైదరాబాద్, మే 19:** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం తేదీలో మార్పు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ నెల 21న జరగాల్సిన కేబినెట్ భేటీని 23వ తేదీకి వాయిదా వేసి, యాదగిరిగుట్టలో నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి యోచిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. బాసరలో ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న సరస్వతీ అంత్య పుష్కరాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పుష్కరాలకు భారీగా భక్తులు తరలిరానుండటంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. మంత్రులలో మెజార్టీ మంది బాసర పుష్కరాల పర్యవేక్షణలో పాల్గొననున్నట్లు సమాచారం. దీంతో అదే రోజు కేబినెట్ సమావేశం నిర్వహించడం కష్టసాధ్యమని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కేబినెట్ సమావేశాన్ని రెండు రోజుల పాటు వాయిదా వేసి, ఈ నెల 23న యాదగిరిగుట్టలో నిర్వహించే ప్రతిపాదన ముందుకు వచ్చినట్లు సమాచారం. రాజధాని హైదరాబాద్‌కు పరిమితం కాకుండా, పుణ్యక్షేత్రాల్లో కూడా పాలనా కార్యక్రమాలు నిర్వహించాలనే ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ క్షేత్రంలో కేబినెట్ సమావేశం నిర్వహించడం ద్వారా ప్రజలకు ఆధ్యాత్మిక, రాజకీయ సందేశం ఇవ్వొచ్చని అధికార వర్గాలు భావిస్తున్నాయి. స్థానిక అభివృద్ధి, ఆలయ పరిసర మౌలిక వసతులు, భక్తుల సౌకర్యాలపై కూడా అక్కడికక్కడే నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. గతంలో సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా మేడారంలో సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్ సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. జాతర ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, నిధుల విడుదలపై అక్కడికక్కడే కీలక నిర్ణయాలు తీసుకోవడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఇప్పుడు అదే తరహా విధానాన్ని యాదగిరిగుట్టలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. బాసర సరస్వతీ అంత్య పుష్కరాల నేపథ్యంలో 21న జరగాల్సిన కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేసి, 23న యాదాద్రిలో నిర్వహించాలనే ప్రతిపాదనపై ప్రభుత్వం దాదాపు నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# కాలంతో పాటు జర్నలిస్టులు మారాలి!

- డిజిటల్ యుగంలో ఆధునిక సాంకేతికతే ఆయుధం
- ఏఐ, సోషల్ మీడియా సవాళ్లపై అవగాహన పెంచుకోవాలి
- జర్నలిస్టులకు డిజిటల్ తరగతులు నిర్వహించాలి
- మీడియా అకాడమీ సమావేశంలో సీనియర్ల అభిప్రాయం



**హైదరాబాద్, మే 19:** నేటి డిజిటల్ యుగంలో జర్నలిజం రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో మీడియా వృత్తిదారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలని సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నాంపల్లిలోని అకాడమీ భవనంలో మంగళవారం ప్రత్యేక చర్చా కార్యక్రమం జరిగింది. ఇందులో పలువురు సీనియర్లు, అకాడమీ అనుబంధ సభ్యులు పాల్గొని మీడియా రంగ భవిష్యత్, డిజిటలీకరణ, మీడియా చట్టాలు, జర్నలిస్టుల సంక్షేమంపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక ప్రధాన కమిషనర్ జి. ముకుంద్ రెడ్డి జర్నలిస్టులను అభినందించారు. తన విద్యార్థి దశలో పత్రికల సంపాదకీయాలు చదవడం ద్వారానే సివిల్ సర్వీసులపై ఆసక్తి పెరిగిందని, అదే తన విజయానికి పునాది అని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జర్నలిజం సమాజానికి అద్దం పట్టే వృత్తి అని, భయపడకుండా నిజాయితీతో వార్తలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రభావం పెరుగుతున్న తరుణంలో జర్నలిస్టులు కొత్త సాంకేతికతపై కచ్చితంగా అవగాహన పెంచుకోవాలని సభ్యులు సూచించారు. అకాడమీ ఆధ్వర్యంలో డిజిటల్ తరగతులు, ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు, డెస్క్ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణలు ఇవ్వాలని ఉడుముల సుధాకర్ రెడ్డి కోరారు. సీనియర్ జర్నలిస్టుల వీడియోలను పుస్తకాల రూపంలోకి తేవాలని దేవులపల్లి అమర్ సూచించారు. పాత పత్రికలు, అరుదైన నిజాం కాలం నాటి ప్రచురణలను డిజిటలైజ్ చేసి భావితరాలకు అందించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో మీడియా చట్టాల్లో కాలానుగుణ మార్పులు తీసుకురావాలని, ముఖ్యంగా సోషల్ మీడియాకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి రూపొందించాలని సీనియర్లు స్పష్టం చేశారు. మహిళా, గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల కోసం ప్రత్యేక శిక్షణలు ఏర్పాటు చేయాలన్నారు. మీడియా అకాడమీ భవనంలోని డిజిటల్ సదుపాయాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. తమ వద్దనున్న విలువైన పుస్తకాలను అకాడమీ లైబ్రరీకి విరాళంగా ఇస్తామని ఐ. వెంకట్ రావుతో పాటు పలువురు సీనియర్లు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు ఐ. వెంకట్ రావు, మాజీ ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, కె. రాంచందర్ మూర్తి, కేశవరావు దాసు, ఎస్. నాగేష్ కుమార్, బండారు శ్రీనివాస్ రావు, రవీందర్, దిలీప్ రెడ్డి, మాడభూషి శ్రీధర్, ఎం. సుబ్బారావు, జగన్, ఆర్.వి. రామారావు, ఎస్. వినయ్ కుమార్, వై. నరేందర్ రెడ్డి, విరాహత్ అలీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాజరైన ప్రముఖులను అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.



# తెలంగాణ సంస్కృతిని దేశానికి చాటాలి!

- జూన్ 2న పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- అధికారుల ఏర్పాట్లపై సీఎస్ వికాస్ రాజ్ సమీక్ష
- గన్ పార్క్ వద్ద అమరవీరులకు సీఎం నివాళి
- ప్రభుత్వ భవనాలకు దేదీప్యమానంగా విద్యుత్ అలంకరణ

**హైదరాబాద్, మే 19 :** జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో కలిసి ఆయన ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఈ వేడుకల సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి ముందుగా గన్ పార్కును సందర్శిస్తారని సీఎస్ తెలిపారు. అక్కడ ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు ఘనంగా నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్ వేడుకల్లో పాల్గొంటారని వివరించారు. పరేడ్ గ్రౌండ్, గన్ పార్కు వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేడుకల విజయవంతం కోసం ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారిని నియమించి, అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను సీఎస్ ఆదేశించారు. ముఖ్యంగా పరేడ్ గ్రౌండ్‌కు వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేసి, ప్రజాలకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సభా ప్రాంగణంలో వాటర్ ప్రూఫ్ షామియానాలు, బారికేడింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్అండ్బీ శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణతో పాటు తాగునీటి సౌకర్యాలు కల్పించాలన్నారు.


### పండుగ వాతావరణంలో..

రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణాన్ని తలపించేలా ఉత్తమ కళాకారులతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను సీఎస్ ఆదేశించారు. నగరంలోని ప్రముఖ ప్రదేశాలైన అసెంబ్లీ, రాష్ట్ర సచివాలయం, చార్మినార్, ప్రజాభవన్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. వేడుకలను ప్రజలందరికీ చేరవేసేలా లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖ స్పెషల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ నెల 25వ తేదీ నుంచి పరేడ్ గ్రౌండ్ వద్ద అన్ని విభాగాలు సంయుక్తంగా రిహార్సల్స్ చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శి రఘునందన్ రావు పాల్గొన్నారు. వీరితో పాటు డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, ఏడీజీ (ఇంటలిజెన్స్) విజయ్ కుమార్, టీజీ జెన్‌కో సీఎండీ హరీష్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సహా పలువురు పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

# కోరిక తీర్చితేనే ఇందిరమ్మ ఇల్లు

## మహిళను వేధించిన కాంగ్రెస్ నేతపై కేసు

**కామారెడ్డి, మే 19:** ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని నమ్మబలికి ఓ మహిళను లైంగికంగా వేధించిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట మండల కేంద్రంలో కలకలం రేపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక నాయకుడిపై రాజంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావాలనే ఆశతో స్థానిక కాంగ్రెస్ నాయకుడు బెస్తా చంద్రంను సంప్రదించింది. అయితే ఇల్లు ఇప్పించాలంటే తన కోరిక తీర్చాలని, తనకు లొంగిపోవాలంటూ అతడు పలుమార్లు వేధించినట్లు బాధితురాలు ఆరోపించింది. వేధింపులు రోజురోజుకూ పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ చివరకు రాజంపేట పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. ఆమె ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మహిళలపై అసభ్యంగా ప్రవర్తించడం, పలువురి వద్ద డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో బెస్ట్ చంద్రంను పార్టీ పదవుల నుంచి సస్పెండ్ చేసినట్లు రాజంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు.



# ఏసీబీ వలకి చిక్కిన జీఎం!

- కుమార్ ఇళ్లపై ఏకకాలంలో దాడులు
- సోదాల్లో కుప్పలుగా నగదు, బంగారం
- నోట్ల లెక్కింపునకు కౌంటింగ్ మిషన్ల



**హైదరాబాద్, మే 19:** హైదరాబాద్ జలమండలిలో ఒక భారీ తిమింగలం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కింది. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై జలమండలి జనరల్ మేనేజర్ కుమార్ నివాసాల్లో ఏసీబీ అధికారులు మంగళవారం తెల్లవారుజాము నుంచి సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భారీ ఎత్తున నగదు, బంగారం, వెండి, ఆస్తుల పత్రాలు బయటపడ్డాయి. మంగళవారం వేకువజాము నుంచే ఏసీబీ అధికారులు బృందాలుగా విడిపోయి హైదరాబాద్‌తో పాటు మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. మల్లాపూర్‌లోని కుమార్ నివాసంలో ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో తనిఖీలు ప్రారంభమయ్యాయి. కుమార్‌తో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ అధికారులు సోదాలు కొనసాగించారు. సోదాల్లో నోట్ల కట్టలను చూసి అధికారులు సైతం ఆశ్చర్యపోయారు. ఇళ్లలో ఎక్కడ చూసినా డబ్బు మూటలు కనిపించడంతో, ఆ నగదును లెక్కించడానికి ప్రత్యేకంగా కౌంటింగ్ మిషన్లను తెప్పించారు. ఈ తనిఖీల్లో దాదాపు ఒక కోటి ఇరవై లక్షల రూపాయల నగదు, ఒకటిన్నర కిలోల బంగారు ఆభరణాలు, రెండున్నర కిలోల వెండిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కేవలం నగదు, బంగారమే కాకుండా నిజామాబాద్ జిల్లాలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో మూడు ఫ్లాట్లు, ఆరు ఓపెన్ ప్లాట్లను అధికారులు గుర్తించారు. మల్లాపూర్‌లోని నివాసం వద్ద రెండు విలాసవంతమైన కార్లను సీజ్ చేశారు. వీటి మార్కెట్ విలువ ప్రాథమికంగా వంద కోట్ల రూపాయల వరకు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. బ్యాంక్ లాకర్లను కూడా తెరిచి పరిశీలించేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు.

# ధర్మపురిలో దొంగలు బస చేసిన లాడ్జి సీజ్

## మున్సిపల్, పోలీస్ శాఖల సంయుక్త చర్యలు

## ఆలస్యంగా స్పందించిన యంత్రాంగంపై విమర్శలు

## వసతి గృహాల్లో భద్రతపై స్థానికుల ప్రశ్నలు



**కరీంనగర్, మే 19 :** కరీంనగర్‌లోని పీఎంజే నగల దుకాణం దొంగతనం కేసు ధర్మపురి పుణ్యక్షేత్రంలో మరో కీలక అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. ఈ దోపిడీకి పాల్పడిన నిందితులు బస చేసిన జగిత్యాల జిల్లా ధర్మపురిలోని విజయలక్ష్మి లాడ్జిని అధికారులు సీజ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్, పోలీస్ శాఖలు సంయుక్తంగా ఈ చర్యలు చేపట్టాయి. నిందితులు ఈ నెల 1వ తేదీ నుండి 3వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఈ లాడ్జిలోనే బస చేసినట్లు విచారణలో తేలింది. ఇంతకాలం సదరు లాడ్జి నిబంధనలను ఉల్లంఘిస్తూ నడుస్తున్నా పట్టించుకోని అధికారులు, దొంగలు బస చేసి వెళ్లిన తర్వాతే అక్రమాలను గుర్తించడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ వందలాది మంది భక్తులు, యాత్రికులు వచ్చే ధర్మపురి వంటి ఆధ్యాత్మిక క్షేత్రంలో వసతి గృహాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ ఏపాటిదో ఈ ఘటన స్పష్టం చేస్తోందని ఆరోపిస్తున్నారు. లాడ్జీలలో కనీస నిబంధనలు పాటిస్తున్నారా, వచ్చే వారి వివరాలు సరిగ్గా నమోదు చేస్తున్నారా, సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా అనే విషయాలపై నిరంతర తనిఖీలు లేకపోవడంపై మండిపడుతున్నారు. భారీ దొంగతనానికి పాల్పడిన నిందితులు రెండు రోజుల పాటు ఇక్కడే ఉన్నా ఎవరికీ అనుమానం రాకపోవడం, వారి కదలికలపై సరైన నిఘా లేకపోవడం భద్రతా లోపాలను ఎత్తిచూపుతోంది. కేవలం ఒక లాడ్జిని సీజ్ చేయడంతోనే సమస్య ముగిసిపోదని, అనుమతులు లేకుండా నడుస్తున్న ఇతర వసతి గృహాలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తాత్కాలిక హడావిడి చేయడం కంటే, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడమే ముఖ్యమని, పుణ్యక్షేత్ర ప్రతిష్టను, భక్తుల భద్రతను కాపాడాలని కోరుతున్నారు.

# జలమండలిలో ఉద్యోగాలంటూ అసత్య ప్రచారం!

## సోషల్ మీడియా పోస్టర్లపై అప్రమత్తత అవసరం

## ప్రస్తుతం ఎలాంటి నియామకాలు లేవని స్పష్టీకరణ

## పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారానే భర్తీ

## తప్పుడు వార్తలను నమ్మవద్దని బోర్డు విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 19:** ఇటీవల సోషల్ మీడియా వేదికగా జలమండలిలో ఉద్యోగ నియామకాల పేరుతో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యమని హైదరాబాద్ నీటి సరఫరా బోర్డు స్పష్టం చేసింది. భారీ స్థాయిలో ఉద్యోగాలు ఉన్నట్లు అర్హతలు, జీతాల వివరాలతో చక్కర్లు కొడుతున్న పోస్టర్ కేవలం తప్పుడు ప్రచారం మాత్రమేనని వెల్లడించింది. ప్రస్తుతం జలమండలిలో ఎలాంటి నియామక ప్రక్రియ చేపట్టలేదని అధికారులు తెలిపారు. ఇటువంటి అసత్య ప్రకటనలను చూసి నిరుద్యోగులు, అభ్యర్థులు మోసపోవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే నిర్ధారణ లేని వార్తలను, పోస్టర్లను నమ్మవద్దని బోర్డు విజ్ఞప్తి చేసింది. జలమండలిలో ఉద్యోగాల భర్తీ చేపట్టాల్సి వస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లేదా సంబంధిత అధికారిక సంస్థల ద్వారానే ప్రకటనలు విడుదల చేస్తామని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లు, విశ్వసనీయ మీడియా వేదికల ద్వారానే ప్రకటిస్తామని తెలిపింది. అభ్యర్థులు కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని సూచించింది.

# నగరంలో దారుణాలు.. వరుస లైంగిక దాడులు

- సినిమా షూటింగ్ ఆశ చూపి యువతిపై లైంగిక దాడి
- ఇబ్రహీంపట్నంలో బీటెక్ విద్యార్థినిపై తోటివాడే ఘాతుకం
- నిందితుడు ఉడుతల ఉదయ్ అరెస్ట్, రిమాండ్
- బాధితులకు గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు



**హైదరాబాద్, మే 19:** భాగ్యనగరంలో వరుసగా వెలుగుచూస్తున్న దారుణ అత్యాచార ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. అమ్మాయిలను మోసం చేస్తూ కామాంధులు రెచ్చిపోతున్నారు. కేసులు నమోదవుతున్నా భయం లేకుండా తెగిస్తున్నారు. సికింద్రాబాద్‌లో ఒక యువతిపై ఇద్దరు వ్యక్తులు రెండు రోజుల పాటు లైంగిక దాడికి పాల్పడగా, ఇబ్రహీంపట్నంలో బీటెక్ విద్యార్థినిపై తోటి విద్యార్థి మద్యం తాగించి ఘాతుకానికి ఒడిగట్టాడు. సినిమా షూటింగ్ ఆశ చూపి ఒక యువతిపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైంది. జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ సమీపంలో ఇద్దరు యువతులు నివసిస్తూ, సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారిలో ఒక యువతికి సినిమా షూటింగ్ ఉందంటూ ఒక యువకుడు మాయమాటలు చెప్పి నమ్మించాడు. అది నిజమని నమ్మిన ఆమె ఆ యువకుడితో కలిసి సికింద్రాబాద్ వెళ్లింది. అక్కడ ఒక గదికి తీసుకెళ్లిన ఆ యువకుడు, తన స్నేహితుడితో కలిసి ఆమెపై రెండు రోజుల పాటు దారుణంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఈ నెల 16న రాపిడో బైక్ బుక్ చేసి ఆమెను తిరిగి ఇంటికి పంపించేశారు. బాధితురాలి శరీరంపై గాయాలు ఉండటాన్ని గమనించిన ఆమె స్నేహితురాలు, వెంటనే ఆమెను గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించింది. అక్కడ వైద్యులు ప్రశ్నించడంతో జరిగిన దారుణాన్ని బాధితురాలు వివరించింది. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరో దారుణం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన ఉడుతల ఉదయ్, ఇబ్రహీంపట్నం సమీపంలోని ఒక ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడోసంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 14న తనతో పాటు చదువుతున్న ఒక యువతిని టీ తాగుదామని కారులో దిల్ సుఖ్ నగర్‌కు తీసుకెళ్లాడు. టీ తాగిన తర్వాత తిరుగు ప్రయాణంలో ఉదయ్ మద్యం కొనుగోలు చేశాడు. ఆ తర్వాత బీఎన్ రెడ్డి రోడ్డులోని ఒక నిర్మానుష్య ప్రదేశానికి కారులో ఆమెను తీసుకెళ్లి, బలవంతంగా మద్యం తాగించాడు. మత్తులో ఉన్న ఆమెను తన గదికి తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఇబ్రహీంపట్నం పోలీసులు నిందితుడు ఉడుతల ఉదయ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.



# దేశంలో రొయ్యల మార్కెటింగ్ పెంచాలి!

## సరైన మార్కెటింగ్ యంత్రాంగం లేక ఆక్వా రైతుల అరిగోస

## ట్రంప్ సుంకాలు, ధరల పతనం, మేత రేట్ల మోతతో కుదేలు

## లేఖలతో సరిపెడుతున్న కూటమి సర్కార్

## 140 కోట్ల దేశీయ మార్కెట్టే ఏకైక శరణ్యం!

**మనదేశంలో పటిష్టమైన మార్కెటింగ్ విధానాలు, సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో పంటలు పండించిన రైతులు నానా యాతన పడుతున్నారు. మదనపల్లి టమోటాలు, నిజామాబాద్ పసుపు, గుంటూరు, వరంగల్, ఖమ్మం మిర్చితో పాటు వడ్లు, మక్కలు, శనగలు పండించే రైతుల పరిస్థితి ఎలా ఉందో.. ప్రస్తుతం ఆక్వా రైతుల పరిస్థితి కూడా అలాగే తయారైంది. దేశంలో ఏ మూల ఏం పండినా, దానిని మారుమూల ప్రజలకు చేరవేసే సమర్థవంతమైన మెకానిజం మనదేశంలో ఇంకా బలపడలేదు. మనదగ్గర మక్కలు పండితే సరైన ధర రాదు కానీ, విదేశీ కంపెనీ కెల్లాగ్ వారు కార్న్ ఫ్లేక్స్ పేరిట వాల్యూ యాడ్ చేసి పావుకిలోను వందల రూపాయలకు అమ్ముకుంటున్నారు. మన సొంత పంటలను వాల్యూ యాడెడ్ చేసి అమ్ముకోలేకపోవడం మన వైఫల్యమే.**

### ట్రంప్ సుంకాలు - ఆక్వాపై దెబ్బ:

ప్రస్తుతం ఆక్వా రైతాంగాన్ని ఒకదాని వెంట మరొక సమస్య చుట్టుముట్టి గుక్కతిప్పుకోనీయడం లేదు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టగానే విధించిన దిగుమతి సుంకాలతో మొట్టమొదట నష్టపోయింది మన రొయ్యల రైతులే. భారతీయ రొయ్యలపై అమెరికా ఏకంగా 60 శాతం వరకు దిగుమతి సుంకం బాదడంతో, ఇక్కడ స్థానిక మార్కెట్లో రొయ్యల ధరలు 20 నుండి 30 శాతం వరకు పడిపోయాయి. ఈ సుంకాల ప్రభావం ఆంధ్రప్రదేశ్ నుంచి ఏటా జరుగుతున్న రూ.25 వేల కోట్ల విలువైన ఆక్వా ఎగుమతులపై తీవ్రంగా పడింది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ట్రంప్‌తో చర్చలు జరిపి సుంకాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని రైతులు ఆందోళనలు చేపట్టినా ఫలితం కానరాలేదు. ఏపీలోని కూటమి సర్కార్ కూడా ఒకటి రెండు సార్లు కేంద్రానికి లేఖలు రాయడం తప్ప ఆక్వా రంగాన్ని ఆదుకోవడానికి పెద్దగా పట్టుబట్టడం లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ నిర్వాకం వల్ల ఆక్వా రైతులు అధోగతి పాలవుతున్నారు.

### ఫీడ్ కంపెనీల దోపిడీ - ధరల మోత:

మరోవైపు అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం కారణంగా పెట్రోలు, డీజిల్ కొరత ఏర్పడి చార్జీలు పెరగడం రైతులను బెంబేలెత్తిస్తోంది. అంతలోనే ఫీడ్ (మేత) కంపెనీలు ఇష్టానుసారంగా, ఏకపక్షంగా ధరలు పెంచేందుకు తెగబడుతున్నాయి. ఫిబ్రవరిలో కిలోపై రూ.4 పెంచిన కంపెనీలు, ఇటీవల మళ్లీ కిలోపై రూ.10 వరకు పెంచుతామని ప్రకటించాయి. రైతుల నుంచి తీవ్ర నిరసనలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా ఆపింది. నిజానికి ఏపీ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం ప్రకారం.. ఫీడ్ ధరలను కంపెనీలు తమకు తాము పెంచడానికి వీల్లేదు, ప్రభుత్వం సమక్షంలో చర్చలు జరగాలి. వరి కంటే ఆక్వా సాగుతో అధిక ఆదాయం వస్తుందని నమ్మించడంతో రొయ్యల సాగు 4.7 లక్షల ఎకరాలకు విస్తరించింది. కానీ వ్యాధులు, మేత ధరలు, ప్రకృతి విపత్తుల వల్ల సాగు రోజురోజుకూ కాస్ట్లీగా మారింది. కూటమి ప్రభుత్వం తాము ఫీడ్ ధరలు తగ్గించామని, యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే ఇస్తున్నామని చెబుతున్నా, పెరిగిన ఖర్చులతో పోలిస్తే ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ చాలా తక్కువ. పైగా విద్యుత్ సబ్సిడీపై ఎన్నో ఆంక్షలు విధిస్తున్నారు.

### విజనరీ ఆలోచనలు కాదు.. ఆచరణ కావాలి:

ఆక్వా రైతులను ఆదుకోవాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి లేఖలు రాసి సరిపెడుతున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో మార్గాలను అన్వేషించడం లేదు. సైనికులకు సరిహద్దుల్లో సరైన ఆహారం దొరకడం లేదనే ఆరోపణల నేపథ్యంలో.. సైన్యం మెనూలో ఆక్వాను చేర్చాలని చంద్రబాబు కోరడం మంచి ఆలోచనే. కానీ, కేవలం లేఖలతోనే సమస్యలు తీరవు. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని ఫీడ్ చార్జీల సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, ఆ రంగంపై ఆధారపడ్డ లక్షలాది మందిని ఆదుకోవాల్సి ఉంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇప్పుడు మనకున్న ఏకైక ప్రత్యామ్నాయం.. రొయ్యలను దేశీయంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం. 140 కోట్లకు పైగా ఉన్న మన దేశ ప్రజలకు సమతుల్య ఆహారం అవసరం. ఇందులో చేపలు, రొయ్యలను చేర్చేలా ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. దేశంలోని అన్ని పట్టణాలకు రొయ్యలు సులభంగా చేరేలా రవాణా, మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. ఇప్పటికీ పక్కనే ఉన్న హైదరాబాద్ లాంటి మహానగరానికి కూడా సక్రమంగా రొయ్యలు చేరడం లేదు. రైతులు పండించే పంటలకు దేశీయంగా సరైన మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనంత కాలం ఇలాంటి సంక్షోభాలు వస్తూనే ఉంటాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రకటనలు గుప్పించడం ఆపి, పక్కా ప్రణాళికతో ఆక్వా రంగాన్ని రక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

# ఎబోలా వ్యాప్తిపై అమెరికా కఠిన ఆంక్షలు

- భారత్‌లోనూ హై అలర్ట్!
- ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై నిషేధం..
- వీసాలు తాత్కాలికంగా నిలిపివేత
- డిజాస్టర్‌గా ప్రకటించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ
- రంగంలోకి దిగిన యూఎస్ సీడీసీ
- భారత్‌కు ప్రస్తుతానికి ముప్పు తక్కువే..
- ప్రయాణాల దృష్ట్యా ఎన్‌సీడీసీ నిఘా






**వాషింగ్టన్/న్యూఢిల్లీ, మే 19:** ఆఫ్రికా ఖండంలో ప్రాణాంతక 'ఎబోలా' వైరస్ (ముఖ్యంగా అరుదైన బుందిబుగ్యో స్ట్రెయిన్) తీవ్రస్థాయిలో విజృంభిస్తుండటంతో అంతర్జాతీయ సమాజం ఉలిక్కిపడింది. ఈ మహమ్మారి వ్యాప్తిని అడ్డుకోవడానికి అమెరికా ప్రభుత్వం అత్యంత కఠినమైన ముందస్తు జాగ్రత్త చర్యలను ప్రకటించింది. వైరస్ ప్రభావిత ఆఫ్రికా ప్రాంతాల నుంచి వచ్చే విమాన ప్రయాణికులపై ప్రవేశ ఆంక్షలు విధించడంతో పాటు, అక్కడ వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండాలలో ఎబోలా వ్యాప్తి తీవ్రమవడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిని 'అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి'గా ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగాలు సంయుక్తంగా ఈ నివారణ చర్యలు చేపట్టాయి.

### అమెరికా ఆంక్షలు - అంతర్జాతీయంగా విమర్శలు

కొత్త నిబంధనల ప్రకారం.. గత 21 రోజుల్లో ఉగాండా, కాంగో, దక్షిణ సూడాన్ దేశాలలో ప్రయాణించిన అమెరికాయేతర పాస్‌పోర్ట్ హోల్డర్లపై తాత్కాలిక ప్రయాణ నిషేధాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఉగాండా రాజధాని కంపాలాలోని అమెరికా ఎంబసీ అన్ని రకాల వీసా సేవలను నిలిపివేసింది. కాంగోలో విధులు నిర్వహిస్తున్న ఒక అమెరికన్ సిబ్బందికి కూడా ఎబోలా వైరస్ సోకినట్లు డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి డాక్టర్ సతీష్ పిళ్ళై ధృవీకరించారు. అతనికి పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం జర్మనీకి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే అతని ప్రైమరీ కాంటాక్టులో ఉన్న మరో ఆరుగురిని క్వారంటైన్‌కు తరలించారు. అయితే, ఈ ఎబోలా సంక్షోభంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం స్పందిస్తున్న తీరుపై అంతర్జాతీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా ప్రపంచ ఆరోగ్య సంస్థ నుండి వైదొలగడం, గతంలో ఎబోలా నియంత్రణలో కీలక పాత్ర పోషించిన 'యూఎస్ ఎయిడ్' నిధులలో కోత విధించడం ప్రస్తుత నియంత్రణ ప్రయత్నాలపై ప్రతికూల ప్రభావం చూపాయనే ఆరోపణలు వస్తున్నాయి. వందలాది కేసులు నమోదై, తీవ్రంగా వ్యాపించిన తర్వాతే ప్రభుత్వం మేల్కొని ఇటువంటి ప్రయాణ నిషేధాలు విధించడం వ్యూహాత్మక వైఫల్యమని జార్జ్‌టౌన్ యూనివర్సిటీ నిపుణులు మాథ్యూ కావనాగ్ విమర్శించారు.

### భారత్‌లో నిఘా తీవ్రం - ఎయిమ్స్ వైద్యుల సూచన

మరోవైపు ఆఫ్రికాలోని కాంగో, ఉగాండా దేశాల్లో ఎబోలా కారణంగా ఇప్పటికే 100 మందికి పైగా మృతి చెందగా, 390కి పైగా అనుమానిత కేసులు నమోదయ్యాయి. ఈ వైరస్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. ఎబోలా వ్యాప్తిని జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం నిశితంగా గమనిస్తోందని, దేశంలోకి ఈ వైరస్ ప్రవేశించకుండా అంతర్జాతీయ విమానాశ్రయాలలో నిఘా పెంచినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం భారతదేశంలో ఎలాంటి ఎబోలా కేసులు లేనప్పటికీ, అంతర్జాతీయ ప్రయాణాలు మరియు గ్లోబల్ కనెక్టివిటీ ఎక్కువగా ఉన్నందున భారత్ అంటువ్యాధుల ముప్పు పట్ల అప్రమత్తంగా ఉండాలని దిల్లీలోని ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ రాయ్ హెచ్చరించారు. ప్రస్తుతానికి దేశానికి ఎబోలా ముప్పు చాలా తక్కువగానే ఉందని, ఈ వ్యాధి వ్యాప్తిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే సరిహద్దుల వద్ద నిఘా, స్క్రీనింగ్ పకడ్బందీగా నిర్వహించాలని ఆయన సూచించారు.

# వీధికుక్కలను తరలించాల్సిందే!

- గత ఆదేశాలు అమలు చేయాల్సిందే
- ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు
- ప్రతీ జిల్లాలో పూర్తిస్థాయి బర్త్‌కంట్రోల్
- స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లలో కుక్కలు లేకుండా చేయాలి
- సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు



**న్యూఢిల్లీ, మే 19:** దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తున్న వీధికుక్కల బెడదపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మరోమారు అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. బహిరంగ ప్రదేశాల నుండి వీధికుక్కలను తరలించాల్సిందేనని, ఈ విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. గతంలో తాము జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని లేదా సవరించాలని కోరుతూ జంతు సంక్షేమ బోర్డు, జంతు ప్రేమికులు దాఖలు చేసిన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు మంగళవారం నిర్ద్వంద్వంగా కొట్టివేసింది. వీధికుక్కల సమస్యను కేవలం జంతు సంక్షేమ కోణంలోనే కాకుండా, అంతకంటే ముఖ్యంగా ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించాలని పిటిషనర్లకు కోర్టు తేల్చిచెప్పింది. ప్రజల, ముఖ్యంగా చిన్న పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్కూళ్లు, కాలేజీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు వంటి పబ్లిక్ ప్రదేశాలలో కుక్కలు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా రూపొందించిన నియమావళిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం కోసం తగిన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఇందులో భాగంగా దేశంలోని ప్రతి జిల్లాలో కనీసం ఒక పూర్తి స్థాయి 'యానిమల్ బర్త్ కంట్రోల్' కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. ఆయా జిల్లాల జనాభాను, కుక్కల సంఖ్యను బట్టి అవసరమైతే ఈ బర్త్ కంట్రోల్ కేంద్రాల సంఖ్యను మరింత పెంచాలని సూచించింది. రేబిస్ వ్యాధి బారిన పడిన లేదా మానవ ప్రాణాలకు ముప్పుగా పరిణమించేలా అత్యంత ప్రమాదకరంగా మారిన వీధికుక్కల విషయంలో చట్టబద్ధంగా అనుమతించిన అన్ని రకాల కఠిన చర్యలను (యుతనేషియా/నిర్మూలన వంటివి) తీసుకోవచ్చని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. అలాగే కుక్క కాటుకు గురైన వారికి తక్షణ చికిత్స అందేలా దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు, మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేసింది. కేవలం వీధికుక్కలే కాకుండా, జాతీయ రహదారులపై ఇష్టానుసారంగా సంచరించే పశువుల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాను సుప్రీంకోర్టు ఆదేశించింది. హైవేలపై తిరిగే జంతువుల వల్ల జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్‌ఏఐకి స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం వీధికుక్కల నియంత్రణ కోసం క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే మున్సిపల్, స్థానిక సంస్థల ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని, విధినిర్వహణ క్రమంలో వారిపై ఎలాంటి బలవంతపు చర్యలు లేదా వేధింపులకు పాల్పడవద్దని సుప్రీంకోర్టు ప్రభుత్వాలను ఆదేశించింది.

# దేశంలో ఆర్థిక తుఫాన్

### కేంద్ర ఆర్థిక విధానాలే ఈ దుస్థితికి కారణం.. రెండు సార్లు ఇంధన ధరల పెంపు

### ఈ సంక్షోభం అదానీ, అంబానీ, మోదీపై ఉండదు : రాహుల్ సంచలన వ్యాఖ్యలు


**రాయబరేలి:** ఐదు రోజుల్లో రెండు సార్లు ఇంధనం ధరలు పెరగడంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో త్వరలో ఆర్థిక తుఫాన్ రాబోతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలే ఈ దుస్థితికి కారణమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సృష్టించిన ఆర్థిక వ్యవస్థ కుప్పకూలనుందని, సాధారణ ప్రజానీకంపై ఇది పెనుభారం కానుందని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలిలో రెండ్రోజుల పర్యటనకు వచ్చిన రాహుల్ అక్కడి మీడియాతో మాట్లాడుతూ, బిలియనీర్లు, పారిశ్రామికవేత్తల కోసం ప్రభుత్వ ఆర్థిక విధానాల రూపకల్పన జరిగిందన్నారు. ఇది పూర్తిగా కుప్పకూలనుందని చెప్పారు. దేశ యువత, రైతులు, చిన్న వ్యాపారులపై ఆర్థిక సంక్షోభ ప్రభావం తీవ్రంగా ఉంటుందని వివరించారు. అయితే ఈ ప్రభావం అదానీ, అంబానీ, మోదీలపై ఏమాత్రం ఉండదన్నారు. మునుముందు అంతా ఇక గడ్డుకాలమేనని చెప్పారు. ఆర్థిక సంక్షోభ నివారణకు కచ్చితమైన నిర్ణయాలు తీసుకోవడానికి బదులు విదేశాలకు వెళ్లొద్దని మోదీ చెబుతున్నారని, ఆయన మాత్రం ప్రపంచమంతా తిరుగుతుంటారని విమర్శించారు. 'బిలియనీర్ల కోసం మోదీ ఆర్థిక వ్యవస్థను తారుమారు చేశారు. గత కొన్ని రోజులుగా ఈ విషయమే ప్రజలకు నేను వివరిస్తున్నాను. ఇప్పుడు ఆర్థిక సంక్షోభం విరచుకుపడనుంది. ఇందువల్ల కీలక పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలపై ఎలాంటి ప్రభావం ఉండదు. వాళ్లు హాయిగా తామున్న చోటే ఉంటారు. కానీ యూపీలోని యువకులు, ప్రజలపై ఈ ఆర్థిక తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుంది' అని రాహుల్ అన్నారు.





# గల్ఫ్ దేశాల విజ్ఞప్తితో ఇరాన్‌పై దాడి వాయిదా

### ట్రంప్ కీలక ప్రకటన



**వాషింగ్టన్:** ఇరాన్‌పై జరగాల్సిన సైనిక దాడిని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గల్ఫ్ దేశాల నేతల విజ్ఞప్తి మేరకు దౌత్య చర్చలకు మరికొంత సమయం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. యుద్ధం మరింత విస్తరించకుండా చర్చలను కొనసాగించాలని ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నాయకులు కోరారని, దాంతో మంగళవారం జరగాల్సిన దాడిని వాయిదా వేసినట్టు ట్రంప్ వెల్లడించారు. ఇరాన్‌పై సైనిక దాడిని వాయిదా వేసినట్టు ట్రంప్ తన సోషల్ మీడియా 'ట్రూత్' ద్వారా వెల్లడించారు. 'ఇరాన్‌పై సైనిక దాడిని వాయిదా వేశాం. సంతృప్తికరమైన ఒప్పందం కుదరకపోతే, పూర్తి స్థాయి భారీ దాడికి అమెరికా సిద్ధంగా ఉంది. ఎప్పుడైనా దాడి చేసేందుకు సిద్ధంగా ఉండాలని అమెరికా సైన్యాన్ని ఆదేశించా' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవల ఇరాన్ నుంచి వచ్చిన కొత్త శాంతి ప్రతిపాదన, పాకిస్థాన్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కూడా దాడిని వాయిదా వేయాలనే నిర్ణయంలో కీలక పాత్ర పోషించినట్లు అమెరికా మీడియా పేర్కొంది. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య అణు చర్చలు, హోర్ముజ్ జలసంధి భద్రత, ఆంక్షల సడలింపులపై చర్చలు కొనసాగుతున్నాయి. ఇరాన్ అణ్వాయుధాలు అభివృద్ధి చేయకూడదన్న విషయంలో మాత్రం అమెరికా కఠిన వైఖరిని కొనసాగిస్తోంది.



# రాష్ట్ర జనాభాలో బీసీలదే ఆధిక్యం

**రాష్ట్ర జనాభాలో యాభై శాతానికి పైగా బీసీలు**

**పురుషుల కంటే మహిళల సంఖ్య అధికం**

**జిల్లాల వారీగా కులాల ప్రాబల్యంపై ఆసక్తికర గణాంకాలు**

**అమరావతి, మే 19 :** ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన కులగణన నివేదికకు సంబంధించిన వివరాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. రెండు వేల ఇరవై నాలుగు ఎన్నికలకు ముందు చేపట్టిన ఈ సర్వే వివరాలు అధికారికంగా విడుదల కాకపోయినా, ప్రస్తుతం బయటకు వచ్చిన గణాంకాలు రాష్ట్ర సామాజిక, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా రాష్ట్ర జనాభాలో యాభై శాతానికి పైగా వెనుకబడిన తరగతుల వారు ఉన్నట్లు నివేదికలో వెల్లడైంది. నివేదిక ప్రకారం రాష్ట్ర మొత్తం జనాభా ఐదు కోట్ల ముప్పై ఒక లక్షల ముప్పై తొమ్మిది వేల యాభై ఆరు మంది. ఇందులో పురుషులు రెండు కోట్ల అరవై మూడు లక్షల అరవై వేల ముగ్గురు కాగా, మహిళలు రెండు కోట్ల అరవై ఐదు లక్షల యాభై ఆరు వేల ఎనిమిది వందల పదహారు మంది ఉన్నారు. పురుషులతో పోలిస్తే మహిళలు దాదాపు ఒక లక్ష తొంభై ఆరు వేల మంది అధికంగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. మొత్తం జనాభాలో వెనుకబడిన తరగతుల వారు రెండు కోట్ల అరవై తొమ్మిది లక్షలతో మొదటి స్థానంలో నిలిచారు. వీరి శాతం యాభై పాయింట్ యాభై తొమ్మిది గా నమోదైంది. అగ్రవర్ణాలు ఒక కోటి ఇరవై ఐదు లక్షలతో ఇరవై మూడు పాయింట్ యాభై మూడు శాతం జనాభాతో రెండో స్థానంలో నిలిచాయి. షెడ్యూల్డ్ కులాల జనాభా తొంభై ఏడు లక్షల ముప్పై రెండు వేలుగా ఉండగా, షెడ్యూల్డ్ తెగలు ముప్పై ఒక లక్షల పదహారు వేలుగా నమోదయ్యాయి. జిల్లాల వారీగా చూస్తే శ్రీకాకుళం జిల్లాలో అత్యధికంగా ఎనభై పాయింట్ ఎనభై మూడు శాతం బీసీలు ఉన్నట్లు తేలింది. విజయనగరం, అనకాపల్లి జిల్లాలు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. జనాభా సంఖ్య పరంగా కూడా శ్రీకాకుళం ముందంజలో ఉండగా, కర్నూలు, విశాఖపట్నం జిల్లాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో బీసీల శాతం నమోదైంది. ఎస్సీ జనాభాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. సంఖ్యాపరంగా తిరుపతి జిల్లాలో అత్యధిక ఎస్సీ జనాభా నమోదైంది. ఇక గిరిజన ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎస్టీ జనాభా అత్యధికంగా ఉండటం విశేషం. అదే సమయంలో పశ్చిమ గోదావరి జిల్లాలో అత్యల్ప ఎస్టీ జనాభా నమోదైంది. ఈ గణాంకాలు అధికారికంగా విడుదల కాకపోయినా రాష్ట్ర రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. కొత్త ప్రభుత్వం కూడా సమగ్ర కుటుంబ సర్వే చేపడుతున్న నేపథ్యంలో ఈ నివేదికకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. రాష్ట్రంలో సామాజిక వర్గాల సమీకరణాలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై ఈ వివరాలు ప్రభావం చూపే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది.

# పోలీస్ పిల్లలకు ఘన సత్కారం

**పోలీస్ కుటుంబాల కృషి అభినందనీయమన్న మంత్రి**

**శ్రీకాళహస్తి, మే 19 :** ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బంది పిల్లలకు ఘన సన్మానం నిర్వహించారు. శ్రీకాళహస్తిలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొని విద్యార్థులను అభినందించారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌తో కలిసి వేదికను పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన జిల్లా ఎస్పీ, కలెక్టర్‌కు అనిత కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు కుటుంబాల పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది రాత్రింబవళ్లు కష్టపడుతూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని అనిత గుర్తు చేశారు. ఒకవైపు విధి బాధ్యతలు నిర్వర్తిస్తూనే, మరోవైపు తమ పిల్లలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేయడం గొప్ప విషయమని అన్నారు. పోలీసు కుటుంబాల త్యాగం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టానికి తగ్గ ప్రతిఫలం అందించారని చెప్పారు. క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి చదివే తత్వం విజయానికి మూలమని విద్యార్థులకు సూచించారు. భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగ రంగాల్లో కూడా ఇదే కృషిని కొనసాగించాలని సూచించారు. ఇలాంటి సత్కార కార్యక్రమాలు విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించే అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు.



# సముద్ర తీరం, మత్స్య సంపదా మనదే!

- మత్స్యకారుల హక్కులు కాపాడతాం
- చేపల వేటకు సబ్సీడీపై 200 మెకనైజ్డ్ బోట్లు
- సీవీడ్ సాగుతో మత్స్యకార మహిళలకూ ఉపాధి అవకాశాలు
- నీటి వనరుల్లో చేపల సాగు చేసుకునే అధికారం మత్స్యకారులదే
- మత్స్యకారుల సేవలో భాగంగా రూ.262 కోట్లను పంపిణీ చేసిన సీఎం
- ప్రజా ప్రభుత్వానిది సంక్షేమం - గొడ్డలి పార్టీది ఫేక్ ప్రచారం
- మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**నెల్లూరు/కావలి, మే 19 (మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తీర ప్రాంత అభివృద్ధిలో, ఇక్కడి అపారమైన మత్స్య సంపదలో స్థానిక మత్స్యకారులకే తొలి భాగస్వామ్యం, సర్వ హక్కులు ఉంటాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మత్స్యకారుల సంక్షేమానికి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందన్నారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'మత్స్యకారుల సేవలో' బహిరంగ సభలో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేట నిషేధ కాలపు భృతి కింద రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున మొత్తం రూ.261.50 కోట్ల ఆర్థిక సహాయాన్ని సీఎం బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేశారు. ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలోనే లబ్ధిదారుల మొబైల్ ఫోన్లకు నగదు జమ అయినట్లు సందేశాలు రావడంతో, వారు ఎంతో హర్షం వ్యక్తం చేస్తూ తమ ఫోన్లను వేదికపై ఉన్న ముఖ్యమంత్రికి చూపించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, సముద్ర తీర ప్రాంతంలో పోర్టులు వస్తే పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి జరుగుతుందని, ఆ ప్రగతి ఫలాలను మత్స్యకారులు అందుకునేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని వెల్లడించారు. కావలి ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు కానుందని, దీని ద్వారా స్థానిక యువతకే పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రూ.288 కోట్లతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం వేగంగా జరుగుతోందని, మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ హార్బర్ కేంద్రంగా సరికొత్త విధివిధానాలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టులపై ప్రతిపక్షాలు కావాలనే అపోహలు, దుష్ప్రచారాలు సృష్టిస్తున్నాయని మండిపడిన ఆయన, ఇలాంటి ఫేక్ ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని పిలుపునిచ్చారు. పొరుగు రాష్ట్రాల వారు ఎవరైనా వచ్చి మన జలాల్లో వేటాడితే సహించేది లేదుని, మన మత్స్యకారుల హక్కులను కాపాడటానికి తీరప్రాంతంలో నిఘా పెట్టి పొరుగు రాష్ట్రాల బోట్లు రాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువుల్లో నీళ్లు నిండుగా ఉన్నాయని, అక్కడ చేపల పెంపకం చేపట్టి ఆ సంపదను విక్రయించుకునే పూర్తి అధికారాలను మత్స్యకారులకే అప్పగించామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నీటి వనరుల్లో ఉచితంగా ఫిష్ సీడ్‌ను అందించేలా ఇతిమద్యే మత్స్యశాఖను ఆదేశించామన్నారు. ప్రపంచవ్యాప్తంగా పౌష్టికాహారమైన చేపలకు మంచి డిమాండ్ ఉందని, మన రాష్ట్ర మత్స్య ఉత్పత్తులకు అంతర్జాతీయ గిరాకీ సృష్టించేందుకు తానే స్వయంగా ఒక 'మార్కెటింగ్ మేనేజర్'గా వ్యవహరిస్తానని హామీ ఇచ్చారు. దేశంలో చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా కొనసాగాలంటే మత్స్యకారులకు మరిన్ని రాయితీలు ఇవ్వాలని భావించిన ప్రభుత్వం, మెకనైజ్డ్ మరియు మోటరైజ్డ్ బోట్లకు లీటరుకు రూ.9 చొప్పున డీజిల్ సబ్సిడీ ఇస్తోందని వివరించారు. ఈ క్రమంలోనే 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.50 కోట్ల విలువైన డీజిల్ సబ్సిడీని అందించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో రూ.3,256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్లు, 8 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణం జరుగుతోందని, మత్స్యకారుల రక్షణ కోసం సముద్రంలో 4,550 ట్రాన్స్ పాండర్లను ఏర్పాటు చేసి అత్యాధునిక కమ్యూనికేషన్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామన్నారు. మత్స్యకారుల కోసం కొత్తగా 200 మెకనైజ్డ్ బోట్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని, ఇందులో 60 శాతం భారీ సబ్సిడీ ఇవ్వటంతో పాటు మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణంగా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు చేపలు ఎక్కడ ఎక్కువగా లభ్యమవుతాయో ముందే తెలిపే సాంకేతికతను జోడించామన్నారు. ఆక్వా కల్చర్ రంగాన్ని ఆదుకోవడానికి ఒక్కో యూనిట్‌కు రూ.1.50లకే నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో అలాగే గత టీడీపీ హయాంలోనూ మత్స్యకారులకు ఎల్లప్పుడూ అండగా నిలిచామని, గతంలో వేట నిషేధ సమయంలో రూ.10 వేలు ఉన్న సాయాన్ని ప్రస్తుత ప్రజా ప్రభుత్వం రూ.20 వేలకు పెంచి వారి కుటుంబాలను ఆదుకుంటోందని గుర్తుచేశారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని, అన్ని వ్యవస్థలను పూర్తిగా విధ్వంసం చేసిందని చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాటి తప్పుడు విధానాల వల్ల 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో చేపల ఉత్పత్తి దారుణంగా పడిపోయిందని, మత్స్యకారులు తీవ్ర కష్టాలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తూ రాష్ట్రాన్ని బుల్లెట్ వేగంతో ముందుకు తీసుకెళు తున్నామని, రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయని వెల్లడించారు. రాయలసీమ ప్రాంతంలో డిఫెన్స్, డ్రోన్స్, ఏరోస్పేస్ రంగాలు వస్తున్నాయని, తిరుపతి వద్ద రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ బుల్లెట్ మోటారు సైకిల్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. నెల్లూరు జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని, ఈ ప్రాంతంలోని 25 మత్స్యకార గ్రామాలను కనెక్ట్ చేస్తూ మెటల్ రోడ్లు వేయనున్నట్లు ప్రకటించారు. నార్త్ బకింగ్ హామ్ కెనాల్ డీసిల్టింగ్ కోసం రూ.6.19 కోట్లను మంజూరు చేస్తున్నామని, భవిష్యత్తులో ఈ కాలువను ఇన్‌లాండ్ వాటర్ వేస్‌గా తీర్చిదిద్దుతామని, కావలి తుమ్మలపెంటను ఒక ఆదర్శ గ్రామంగా మారుస్తామని వాగ్దానం చేశారు. తెలుగుదేశం పార్టీ డీఎన్‌ఏలోనే వెనుకబడిన తరగతులు (బీసీలు) ఉన్నారని, బీసీలకు ఈ పార్టీకి దశాబ్దాల అనుబంధం ఉందని ముఖ్యమంత్రి భావోద్వేగంగా పంచుకున్నారు. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేల వేతనం కల్పిస్తూ, వడ్డెర్లకు, గీత కార్మికులకు గనులు, మద్యం దుకాణాల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధ ప్రభావం వల్ల అంతర్జాతీయంగా ఆయిల్ ధరలు పెరిగాయని, గ్యాస్ కొరత ఏర్పడిందని పేర్కొంటూ, దేశ పురోగతి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ సూచించిన 7 సూత్రాల ప్రకారం అనవసర ప్రయాణాలు తగ్గించుకోవడం, ప్రజా రవాణాను వినియోగించడం, కొనుగోలును కొద్దిరోజులు వాయిదా వేసుకోవడం మరియు టూరిజం కోసం విదేశాలకు వెళ్లకుండా మన దేశంలోని బీచ్‌లు, పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని ప్రజలకు సూచించారు. సభా ప్రాంగణం సమీపంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, ఉద్యాన శాఖల స్టాళ్లను ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. తీరప్రాంతాల్లోని మత్స్యకార మహిళలు, డ్వాక్రా మహిళల ఆర్థిక సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'సీఎస్ఎంసీఆర్ఐ' సహకారంతో సముద్రపు నాచు (సీవీడ్) సాగుపై శిక్షణ ఇచ్చే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ చేసిందన్నారు. అనంతరం నెల్లూరు జిల్లా తీరప్రాంత నిరంతర పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన 'సీ పెట్రోలింగ్ జాయింట్ యాక్షన్ టాస్క్ ఫోర్స్' కేంద్రాన్ని సందర్శించి మెరైన్ పోలీస్, మత్స్యశాఖల సమన్వయ గస్తీని సమీక్షించారు. సరిహద్దుల్లోకి వచ్చే ఇతర రాష్ట్రాల బోట్లను గుర్తించి తెలుగు, తమిళ భాషల్లో హెచ్చరికలు జారీ చేసే డ్రోన్ల సాంకేతికతను, అంతర్జాతీయ జలాల్లోకి వెళ్లినప్పుడు మన బోట్లను హెచ్చరించే జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను సీఎం పరిశీలించారు. ఈ పర్యటనలో రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కె. అచ్చెన్నాయుడు, ఎన్.ఎమ్.డి. ఫరూఖ్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కావలి ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డితో పాటు జిల్లా ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రులకు రూ.919 కోట్ల విడుదల

**ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు బకాయిల చెల్లింపులు**

**785 ఆసుపత్రుల ఖాతాల్లోకి నేరుగా నిధులు**

**ఇప్పటి వరకు రూ.5,556 కోట్లు విడుదల**

**ఆరోగ్య సేవల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి**

**అమరావతి, మే 19 :** ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సేవల బలోపేతం దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ప్రైవేట్ ఆసుపత్రుల బకాయిల చెల్లింపుల కోసం ప్రభుత్వం రూ.919.13 కోట్లను విడుదల చేసినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ట్రై-పార్టీ బిల్ డిస్కౌంటింగ్ విధానంలో భాగంగా ఈ నిధులను నేరుగా ఆసుపత్రుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలిపారు. ఏపీ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 785 ప్రైవేట్ ఆసుపత్రులకు ఈ నిధులు అందినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రైవేట్ ఆసుపత్రులకు మొత్తం రూ.5,556 కోట్లను చెల్లించామని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. బకాయిల చెల్లింపుల విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆరోగ్య సేవల నిర్వహణలో ప్రైవేట్ ఆసుపత్రుల పాత్ర కీలకమని, వారికి సమయానికి బకాయిలు చెల్లించడం ద్వారా వైద్య సేవలు అంతరాయం లేకుండా కొనసాగుతాయని తెలిపారు. ఈ మేరకు ట్రస్టు సీఈఓ చక్రధరబాబు నివేదికను మంత్రికి అందజేశారు.



# కృష్ణమ్మ ఒడి నుంచి పడవల వందనం

**వంద బోట్లపై వచ్చి సీఎం, ప్రభుత్వానికి మత్స్యకారుల కృతజ్ఞతలు**

**- ఇంటికి ఆహ్వానించి ప్రశంసించిన మంత్రి నారా లోకేష్**

**అమరావతి, మే 19 :** ఇదొక అరుదైన కృతజ్ఞత. మరో ఆత్మీయ ఆతిథ్యం. రెండింటి కలయికకు కృష్ణమ్మ వేదిక అయ్యింది. కూటమి ప్రభుత్వం రెండో ఏడాది 'మత్స్యకారుల సేవలో- నిధులు విడుదల చేయడంతో కృష్ణానదిలో పెద్ద సంఖ్యలో బోట్లు, పడవలతో సీఎం ఇంటి వరకూ వచ్చి చంద్రబాబు గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. వెంకటపాలెం, తుమ్మలపాలెం, సీతానగరం, కుమ్మర పాలెంలకు చెందిన మత్స్య కారులు సుమారుగా వంద బోట్లలో వచ్చారు. మత్స్యకారులను ఇంట్లోంచి చూసిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వారికి అభివాదం చేస్తూనే..రమ్మంటూ వారిని తన ఇంటికి ఆహ్వానించారు. మత్స్యకారులంతా సీఎం ఇంటికి వచ్చారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేయడానికి వచ్చిన మత్స్యకారులను అభినందించిన మంత్రి లోకేష్ మాట్లాడుతూ-గంగపుత్రులు..అభిమాన



మిత్రులు. యువగళం పాదయాత్ర జువ్వలదిన్నె చేరుకున్నప్పుడు మత్స్యకారుల పట్టుదల, ఐకమత్యం చూశాను. ఊరంతా ముగ్గులు వేశారు. నేను వచ్చేంతవరకూ ఆ ముగ్గులపై ఎవ్వరినీ నడవనీయలేదు. ఊరంతా శుభ్రం చేసి, రంగు రంగుల ముగ్గులతో ఒక పండగలా నాకు స్వాగతం పలికారు. అంతా కలిసి ఒక్క మాట అనుకుంటే, దానిపై నిలబడతారు. మత్స్యకారుల నుంచి ఈ మాట మీద నిలబడే తత్వం అందరం అలవర్చుకోవాలి. అని కొనియాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం ఎంత ధ్వంసమైందో అందరూ చూశారు. ప్రతీ ఒక్కరూ బాధితులయ్యారు. కంపెనీలు తరలిపోయాయి. రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తూనే, ప్రజాసంక్షేమానికి పాటుపడుతున్నాం. గత ప్రభుత్వం చేసిన తప్పులు సరిదిద్దుకుంటూ ఇవన్నీ చేస్తున్నాం. మత్స్యకారుల కష్టం నేను కళ్లారా చూశాను. ఇన్ని కష్టాలు పడినా, పిల్లలను బాగా చదివిస్తున్నారు. పిల్లలకు మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రపంచం మొత్తం తిరిగి కంపెనీలు తీసుకొస్తున్నాం. ఇందులో భాగంగానే జువ్వలదిన్నెలో డిఫెన్స్ కంపెనీకి శంకుస్థాపన చేశాం- అని లోకేష్ తెలియజేశారు. తమిళ జాలర్లు మన వైపు రాకుండా, వాళ్లకు మనకు మధ్య సర్వేలెన్స్ కోసం అటానమస్ పెట్రోలింగ్ బోటు ను సాగర్ డిఫెన్స్ కంపెనీ ఏర్పాటు చేయబోతోందని తెలిపారు. మత్స్యకారులకు ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య అయినా ఎప్పుడూ మా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని లోకేష్ భరోసా ఇచ్చారు. ఇంట్లో కూర్చోబెట్టుకుని మత్స్యకారులందరితోనూ ఆప్యాయంగా మాట్లాడిన మంత్రి.. ఫోటోలు దిగారు. తాము సీఎంకు కృతజ్ఞతలు చెప్పడానికి వస్తే..మంత్రి లోకేష్ తమకు ఆత్మీయ ఆతిథ్యం అందించారని మత్స్యకారులు సంతోషం వ్యక్తంచేశారు.

# లారీలు రావు..వడ్లు కదలవు..!

- విసిగిపోయిన రైతుల రోడ్డుపై నిరసన
- వీరనగర్ వద్ద గజ్వేల్--చేగుంట రహదారిపై ట్రాఫిక్ స్తంభనం
- సీఐ హామీతో ఆందోళన విరమణ



**రాయపోల్, మే 19:** కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చినా లారీలు లేక రోజులు గడుస్తుండటంతో రైతుల సహనం చివరకు చెదిరిపోయింది. “పంట పండించాం... ఇప్పుడు అమ్ముకునే దారిలేదు” అంటూ సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం వీరనగర్ రైతులు మంగళవారం గజ్వేల్--చేగుంట ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు.ఐకేపీ ఆధ్వర్యంలో వడ్లు కొనుగోలు చేస్తామని చెప్పినా, కేంద్రానికి సరిపడా లారీలు పంపకపోవడంతో ధాన్యం కుప్పలు కేంద్రంలోనే పేరుకుపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల భయంతో రాత్రిం బవళ్లు కాపలా కాస్తున్నా అధికారుల నుంచి స్పందన కనిపిం చడం లేదని మండిపడ్డారు. ఎన్నిసార్లు సమస్యను తెలిపినా ఫలితం లేకపోవడంతో చివరకు రాస్తారోకోకు దిగాల్సి వచ్చిందన్నారు.రైతులు రహదారిపై ధర్నా చేయడంతో గజ్వేల్--చేగుంట మార్గంలో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ పూర్తిగా స్థంభించింది. రహదారి వెంట భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఆందోళన విషయం తెలుసుకున్న తొగుట సీఐ ఎస్.కే. లతీఫ్ రైతులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి లారీలు అందుబా టులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.“ధాన్యం అమ్ముకునేందుకే రైతు రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరం” అంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వారం రోజుల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలి


- నారాయణపేట జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్



**మరికల్ మండలం, మే,19(సమయం న్యూస్) :** మరికల్ గురుకుల పాఠశాలలో రూ.43 లక్షలతో చేపట్టిన వివిధ మరమ్మతు పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. మంగళ వారం కలెక్టర్ మరికల్ గురుకుల పాఠశాల/కళాశాలను సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న శానిటేషన్, ఎలక్ట్రికల్, ఇతర నిర్మాణ పనులను పరిశీలించారు. పాఠశాలలో డ్రైనేజీ నిండిపోయిందని, కొన్ని మరుగు దొడ్ల మరమ్మతు చేయిస్తే వినియోగంలోకి వస్తాయని ప్రిన్సిపల్ నాగ మణిమాల కలెక్టర్ కు తెలపగా, ముందుగా మరుగు దొడ్ల మరమ్మతు పనులను పూర్తి చేయాలని కలెక్టర్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. పాఠశాల కు చెందిన వాటర్ ట్యాంకు నిండి నీరు వృథాగా పారుతుండటం గమనించిన కలెక్టర్ వాటర్ ట్యాంకు పైపులైన్ కు ఆన్ ఆఫ్ వాల్ పెట్టించమని ప్రిన్సిపల్ కు సూచించారు. అక్కడే ఒక ఇంకుడు గుంత నిర్మించాలని ఏ పీ వో ను ఆదేశించారు. పాఠశాలల్లో కొనసాగుతున్న మరమ్మతు పనులన్నీ వారం రోజుల్లో పూర్తి కావాలని ఆమె స్పష్టం చేశారు. పాఠశాల వంట ఏజెన్సీ వాళ్ళు వచ్చే నెల నుంచి వంట చేయమని, తమకు రేట్లు గిట్టుబాటు కావడం లేదని చెబుతున్నారని, పాఠశాల ప్రారంభం అయితే విద్యార్థులకు వంట వండటానికి ఇబ్బందులు ఏర్పడతాయని ప్రిన్సిపాల్ కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన కలెక్టర్.. కొత్త ఏజెన్సీకి వంట బాధ్యతలు అప్పగించాలని,లేదంటే మహిళా సంఘాల సభ్యులకు ఏజెన్సీ ఇవ్వాలని సూచించారు. ఈ విషయంలో ఎంపీడీవో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాఠశాల ప్రారంభం అయ్యేలోపు సమస్య ను పరిష్కరించాలని తెలిపారు. వంట ఏజెన్సీ, పండ్లు, గుడ్లు, ఇతర నిత్యావసర సరుకులు సరఫరా కు సంబంధించి అన్నింటికి టెండర్లు పిలవాల్సి ఉందని, ఇంకా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని ప్రిన్సిపాల్ కలెక్టర్ కు వివరించారు. టెండర్ల ప్రక్రియ కు ఆదేశాలు వచ్చేలోపు పాఠశాల వంట ఏజెన్సీ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలన్నారు. టెండర్ల ప్రక్రియ ఎప్పుడూ ప్రారంభమైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్, మరికల్ తహసిల్దార్ రామ్ కోటి, ఎంపీడీవో పృథ్వీరాజ్, పీఆర్ డీ. ఈ, ఏ. ఈ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత




**ఆసిఫాబాద్, మే 19 (సమయం న్యూస్):** జిల్లా అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో కలిసి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ, ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను పూర్తిచేయాలని ఆదేశించారు. విద్యార్థులకు తొలి రోజునే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.వర్షాకాలానికి ముందే రహదారులు, భవనాలు, వంతెనలు, ఇతర మరమ్మత్తు పనులను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ శాఖలకు సూచించారు. గ్రామాలకు నిరంతర త్రాగునీటి సరఫరా అందేలా పైప్‌లైన్ మరమ్మత్తులు చేపట్టాలని తెలిపారు.అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలని, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు పర్యవేక్షిస్తూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధన్వాడ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మార్చండి

- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్



**ధన్వాడ మండలం, మే,19(సమయం న్యూస్) :** ధన్వాడ మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహం పూర్తిగా శిథిలావస్థ కు చేరిందని, వసతి గృహాన్ని అక్కడి నుంచి మార్చి వేరే అనువైన భవనంలోకి మార్చాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. మంగళ వారం ఆమె ధన్వాడ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహం లోపల పై కప్పు పెచ్చులూడి ఉండటం, వంటగది పై కప్పు కూడా శిథిలావస్థకు చేరటం, వసతి గృహా మరుగు దొడ్లు, స్నానపు గదుల కు తలుపులు లేకపోవడాన్ని చూసిన కలెక్టర్ మరమ్మతులు చేయించినా లాభం లేదని, భవనం పూర్తిగా కూలిపోయే పరిస్థితి ఉందని, ఇక వచ్చే నెల పాఠశాలలు పునః ప్రారంభం వరకు ధన్వాడ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని వేరే చోటికి, మరికల్, లేదా నారాయణ పేట జిల్లా కేంద్రంలో విద్యార్థులకు అన్ని వసతి,సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ,లేదా ప్రైవేటు భవనంలోకి మార్చాలని కలెక్టర్ సాంఘిక సంక్షేమ అధికారి అబ్దుల్ ఖలీల్ కు సూచించారు. అలాగే ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చి వేసి అక్కడే నూతన భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదించాలని చెప్పడంతో ఇప్పటికే నూతన భవన నిర్మాణానికి రూ.3 కోట్ల 22 లక్షలతో ప్రతిపాదనలు పంపించండ జరిగింది అని సాంఘిక సంక్షేమ అధికారి కలెక్టర్ కు తెలిపారు. అలాగైతే ప్రస్తుతానికి ధన్వాడ ఎస్సీ బాలుర వసతి గృహం కోసం ఏదైనా అద్దె భవనాన్ని చూసి, మార్చేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ధన్వాడ తహశీల్దార్ సింధూజ, ఎంపీవో, తదితరులు పాల్గొన్నారు.

# రాంసాగర్ లో భద్రాచల రామయ్య తలంబ్రాల పంపిణి

- రామకోటి రామరాజు ఆధ్యాత్మిక సేవలకు ఘన సన్మానం
- రామయ్య తలంబ్రాలు అందుకోవడం అదృష్టమన్న భక్తులు



**రాయపోల్, మే19 :** భద్రాచల రామయ్య కల్యాణ ముత్యాల తలంబ్రాలను మంగళవారం నాడు సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలోని రామాలయంలో శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు గారు భక్తులచే భజన చేయించి తలంబ్రాల పవిత్రత, వాటి విశిష్టత తెలియజేసి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామయ్య కళ్యానానికి రాంసాగర్ గ్రామం నుండి పెద్ద ఎత్తున గోటి తలంబ్రాలు ఓలిచి అందించారని తెలిపారు. భద్రాచలం నుండి 100కిలోల ముత్యాల తలంబ్రాలు భక్తుల కోసం తీసుకొచ్చానన్నారు. తలంబ్రాలు అందుకోవడం ఆనందంగా ఉందని మేము భద్రాచలం వెళ్ళలేకున్న మా గోటి తలంబ్రాలు వెళ్లాయి, ఇప్పుడు ముత్యాల తలంబ్రాలు తిరిగి ఆదుకోవడం అదృష్టంగా ఉందని రామకోటి రామరాజు కృషి, పట్టుదల గొప్పదని ఆలయ కమిటీ వారు ఘనంగా సన్మానించారు. ప్రతి సంవత్సరం ఇలాంటి అవకాశం ఇవ్వాలని భక్తులు కోరారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటి అధ్యక్షులు ఎమిశెట్టి వేంకటేశం, సర్పంచ్ భాగన్న గారి నరేష్ గౌడ్, ఉప సర్పంచ్ పోచయ్య, నాయిని ఆదిరెడ్డి, బిక్కుమల్ల నాగేష్, పడగంటి లక్ష్మీనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

# రావులపల్లి లో“రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు”

-- అన్నదాతల అవగాహన కార్యక్రమం నిర్వహణ



**కొడంగల్ మండలం, మే,19(సమయం న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 **DAYS ACTION PLAN** లో భాగంగా ఏప్రిల్ 27 నుండి మే 23, 2026 వరకు నిర్వహిస్తున్న “రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు” కార్యక్రమంలో భాగంగా రావులపల్లి రైతు వేదిక లో రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కంది, పత్తి, వరి పంటల సాగులో యూరియా వినియోగం, నేల ఆరోగ్య పరిరక్షణ, పురుగు నివారణ వంటి అంశాలపై వ్యవసాయ కళాశాల –పాలెం నుండి విచ్చేసిన డా॥ ఇ సత్యనారాయణ – సాయిల్ సైన్స్ శాస్త్రవేత్త, బి. పరమేశ్ – శాస్త్రవేత్త రైతులకు అవగాహన కల్పించారు.

**అవగాహన కార్యక్రమంలోని ముఖ్యాంశాలు:**

1. యూరియా వినియోగం:
కంది, పత్తి, వరి పంటలకు అవసరానికి మించి యూరియా వాడకూడదని, మట్టి పరీక్షల ఆధారంగా మాత్రమే ఎరువులు వాడాలని సూచించారు.

2 నేల ఆరోగ్య పరిరక్షణ:
రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రీయ ఎరువులు మరియు పచ్చిరొట్ట ఎరువులు వాడటం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని వివరించారు.

3. పురుగు నివారణ:
పత్తి పంటలో వచ్చే పురుగులు, తెగుళ్ల నివారణకు సమీకృత సస్య రక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు.

4. పంట మార్పిడి:
పంట మార్పిడి విధానం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడి, తెగుళ్ల తీవ్రత తగ్గుతుందని తెలిపారు.

5. నీటి యాజమాన్యం
డ్రిప్, స్ప్రింక్లర్ వంటి ఆధునిక సాగు నీటి పద్ధతులను అనుసరించి నీటిని ఆదా చేయాలని సూచించారు

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ్ల పద్మమ్మ, మండల వ్యవసాయ అధికారి ఎన్. శ్రీలత, ఎఇఓ ఎల్. సుమ మరియు రావులపల్లి గ్రామ పెద్దలు , రైతులు పాల్గొన్నారు

# జలమండలిలో ఉద్యోగాలు.. అంటూ అసత్య ప్రచారం

- జలమండలి క్లారిటీ- సోషల్ మీడియా పోస్టర్లపై అప్రమత్తంగా ఉండాలి
- ప్రస్తుతం ఎలాంటి నియామకాలు లేవని స్పష్టం
- ఉద్యోగ నియామకాలు ఉంటే TGPSC లేదా అధికారిక సంస్థల
- ద్వారానే ప్రకటనలు విడుదల చేస్తామని వెల్లడి

**హైదరాబాద్ మే19( సమయం న్యూస్) :** ఇటీవల సోషల్ మీడియా వేదికగా “హైదరాబాద్ నీటి సరఫరా బోర్డు, తెలంగాణ రిక్రూట్మెంట్ 2026” పేరుతో ఒక పోస్టర్ వైరల్ అవుతోంది.ఆ పోస్టర్‌లో జలమండలిలో భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు, వేతనాలు మరియు అర్హతల వివరాలు పేర్కొంటూ తప్పుడు ప్రచారం జరుగుతోంది.ఈ సందర్భంగా జలమండలి స్పష్టం చేయునది ఏమనగా...

ప్రస్తుతం పోస్టర్‌లో పేర్కొన్న విధంగా ఎలాంటి నియామక ప్రక్రియను జలమండలి చేపట్టలేదు. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న సమాచారం పూర్తిగా అసత్యం.. ఫేక్ న్యూస్.

జలమండలిలో ఉద్యోగ నియామకాలు చేపట్టాల్సి వచ్చిన సందర్భంలో, అవి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGPSC) లేదా సంబంధిత అధికారిక సంస్థల ద్వారా మాత్రమే నిర్వహించబడతాయి.

ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటనలు ప్రభుత్వ, జలమండలి అధికారిక వెబ్‌సైట్లు, విశ్వసనీయ మీడియా వేదికల ద్వారా విడుదల చేయబడతాయి.కావున ప్రజలు, ఉద్యోగార్థులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నిర్ధారణ లేని పోస్టర్లు, వార్తలు, తప్పుడు ప్రకటనలను నమ్మవద్దని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది.అధికారిక సమాచారం కోసం మాత్రమే ప్రభుత్వ, జలమండలి అధికారిక ప్రకటనలను అనుసరించాలి.

## జనగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ అంకిత్



**అశ్వాపురం మే 19( సమయం న్యూస్). :** అశ్వాపురం మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మిక పర్యటన నిర్వహించి సెన్సస్--2027 జనగణన సర్వే, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను పరిశీలించారు. మల్లెలమడుగు గ్రామంలో ఇంటింటి సర్వేను పరిశీలించిన కలెక్టర్ ప్రతి ఇంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిల్వలు, రవాణా, కొనుగోలు ప్రక్రియపై సమీక్ష నిర్వహించి రైతులకు ఇబ్బందులు లేకుండా వేగంగా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం సీతారాంపురంలోని శివసాయి రైస్ మిల్‌ను తనిఖీ చేసి మిల్లింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.

## హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ జీఎంపై ఏసీబీ దాడులు

**హైదరాబాద్, మే 19:( సమయం న్యూస్). :** హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (ఎవీఔాదీ) జనరల్ మేనేజర్ కుమార్‌కు చెందిన ఆస్తులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. అక్రమాస్తుల కేసులో భాగంగా హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో సుమారు ఎనిమిది చోట్ల తనిఖీలు కొనసాగుతున్నాయి.దాడుల సందర్భంగా అధికారులు రూ.1.05 కోట్ల నగదు, భారీ మొత్తంలో బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పలు ఆస్తులకు సంబంధించిన పత్రాలు కూడా గుర్తించినట్లు తెలుస్తోంది.ప్రాథమిక సమాచారం ప్రకారం కుమార్ దాదాపు రూ.100 కోట్ల విలువైన ఆస్తులను అక్రమంగా కూడబెట్టినట్లు ఏసీబీ అనుమానిస్తోంది. హైదరాబాద్‌లో గేటెడ్ కమ్యూనిటీలో మూడు ఫ్లాట్లు, నగర శివార్లలో ఆరు ఓపెన్ ప్లాట్లు, నిజామాబాద్ జిల్లాలో మూడు ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం.మల్లాపూర్‌లోని కుమార్ నివాసంతో పాటు ఇతర అనుబంధ ప్రదేశాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. విచారణలో భాగంగా బ్యాంక్ లాకర్లను కూడా పరిశీలించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అవసరమైతే కుమార్ బంధువుల ఇళ్లలో కూడా దాడులు చేపట్టే అవకాశముంది.దాడులు ఇంకా కొనసాగుతున్నాయని, స్వాధీనం చేసుకున్న ఆస్తుల మొత్తం విలువపై అధికారిక లెక్కలు ఇంకా తేలాల్సి ఉందని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి



కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మే 19( సమయం న్యూస్). :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హాజీపూర్, నస్పూర్, లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల్లోని కొనుగోలు కేంద్రాలు, గోదాములు, రైస్ మిల్లులను ఆయన పరిశీలించారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, గోనె సంచులు, టార్పాలిన్లు, తేమ యంత్రాలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలని తెలిపారు.రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతిని వేగవంతం చేసి, అవసరమైన హమాలీల సంఖ్యను పెంచుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు.

## జిల్లాలో ఇసుక అక్రమ త్రవ్వకాలు పూర్తిగా నిర్మూలించాలి:

● జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



**నిర్మల్ మే19( సమయం న్యూస్) :** జిల్లాలో ఇసుక అక్రమ త్రవ్వకాలు పూర్తి స్థాయిలో నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇసుక రీచ్ లను గుర్తించాలన్నారు. అక్రమ ఇసుక త్రవ్వకాలని పూర్తిస్థాయిలో నివారిస్తామని చెప్పారు. కేవలం మన ఇసుక వాహనం యాప్ ద్వారానే ఇసుక అమ్మకాలు పారదర్శకంగా జరగాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చూడాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టినా, రవాణా చేసిన చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో నిఘా ఉంచాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, భూగర్భ జల అధికారి శ్రీనివాస బాబు, డిపిఓ శ్రీనివాస్, రాయల్టీ ఇన్స్పెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇకపై వాట్సాప్ మీసేవలో మరిన్ని జీహెచ్ఎంసీ సేవలు

- కొత్తగా తొమ్మిది పౌర సేవలు అందుబాటులోకి
- డిజిటల్ సేవలను మరింత విస్తరించిన ప్రజాప్రభుత్వం



**హైదరాబాద్ మే19( సమయం న్యూస్). :** జీహెచ్ఎంసీకి సంబంధించిన పౌర సేవలను కొత్తగా మీసేవ వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత సౌకర్యం, అందుబాటు, పారదర్శకత కల్పించే దిశగా ఈ సేవలను విస్తరించారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీసేవ ద్వారా పౌర సేవలను మరింతగా తీర్చిదిద్దుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ సేవల ప్రధాన వేదికగా ఉన్న మీసేవను వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా మరింత విస్తరించారు. ఈ అదనపు డిజిటల్ ఛానల్‌ను 2025 నవంబర్ 18న ప్రారంభించారు.కొత్తగా జీహెచ్ఎంసీ ప్రాపర్టీ అసెస్‌మెంట్ రివిజన్, జనన ధ్రువీకరణ సవరణ, మరణ ధ్రువీకరణ సవరణ, బర్త్ హోమ్(ఇంటి దగ్గర పుట్టిన), డెత్ హోమ్(ఇంటి దగ్గర చనిపోయిన), ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ, ప్రాపర్టీ పేరు సవరణ, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ సేవలను వాట్సాప్ మీసేవలో చేర్చారు. రాష్ట్రవ్యాప్తంగా పౌరులు ఈ సేవలను వాట్సాప్ ద్వారానే పొందవచ్చని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం తెలిపింది.సేవలు పొందేందుకు ముందుగా 8096958096 నంబర్‌ను మొబైల్‌లో 'వీవమావఋ ువశ్రీఖఅస్త్రుఋ' పేరుతో సేవ్ చేసుకోవాలి. అనంతరం వాట్సాప్‌లో ఆ నంబర్‌కు 'ుఱ' సందేశం పంపాలి. అవసరమైన సేవ పేరు టైప్ చేసి, మెనూలో కనిపించే 'ాజూవఅ ావతీజఱఎవ' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఫారంలో అడిగిన వివరాలు, చెల్లింపు పూర్తిచేస్తే దరఖాస్తు వెంటనే వాట్సాప్ ద్వారా నమోదవుతుంది.

వాట్సాప్ ఆధారిత మీసేవ వేదికకు ప్రారంభం నుంచి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ప్రభుత్వం వెల్లడించింది. జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పోలీస్ చలాన్, విద్యుత్ బిల్లు, బీఐఈ ఫలితాల సేవలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలిపింది. రోజువారీ పరిపాలన సేవలకు వాట్సాప్‌పై ప్రజల ఆధారపడటం పెరుగుతోందని పేర్కొంది.

డిజిటల్ సేవలను నిరంతరం విస్తరించడం, ప్రభుత్వ వ్యవస్థల విశ్వసనీయతను బలోపేతం చేయడం, పౌరులకు సులభమైన అనుభవం కల్పించడం తమ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

## ఆదిలాబాదు పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి చాటుదాం

● 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'కు కలెక్టర్ రాజర్షి షా పిలుపు

**అదిలాబాద్ మే19( సమయం న్యూస్) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాలలో భాగంగా వినూత్నంగా 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్' నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం మావల పార్క్‌లో నిర్వహించిన ప్రెస్ టూర్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో కలిసి సఫారీలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఆదిలాబాదు జిల్లాలోని అద్భుతమైన ప్రకృతి సంపద, జలపాతాలు, చారిత్రక వైభవం, స్థానిక ఆదివాసీ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులకు పరిచయం చేసేందుకు జిల్లా యంత్రాంగం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ పోటీల నిర్వహణ వల్ల జిల్లా పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించడమే కాకుండా, స్థానిక కంటెంట్ క్రియేటర్ల ప్రతిభ వెలుగులోకి వస్తుందని అన్నారు.ఈ పోటీలలో పాల్గొనేందుకు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా హ్యాండ్లర్స్ అందరూ అర్హులని స్పష్టం చేశారు. పోటీదారులు ఆదిలాబాదు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, ప్రకృతి అందాలు, జలపాతాలు, చారిత్రక కట్టడాలు, సంస్కృతిని ప్రతిబింబించేలా రీల్స్ లేదా వీడియోలను రూపొందించాల్సి ఉంటుందని తెలిపారు.పోటీకి పంపే వీడియోలు తప్పనిసరిగా అత్యుత్తమ నాణ్యతతో కూడిన 4ఖ ఫార్మాట్‌లో ఉండాలన్నారు. ఈ నెల మే 21 గురువారం ఉదయం 11గంటల లోపు ఆసక్తి గల క్రియేటర్లు తమ సొంత పెన్‌డ్రైవ్ ద్వారా జిల్లా కేంద్రం లోని విద్యుత్ తరంగిని ఫంక్షన్ హాల్ లో నేరుగా వీడియోలను అందజేయాలన్నారు.

సందేహాలు, సలహాల కోసం జిల్లా పర్యాటక శాఖ అధికారి వి. రవికుమార్ -- 9440816087, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఇ. విష్ణువర్ధన్ -- 9154170902 లను సంప్రదించవచ్చని తెలిపారు.పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రియేటర్లకు జిల్లా యంత్రాంగం తరఫున ప్రథమ బహుమతిగా ₹5,000/-, ద్వితీయ బహుమతిగా ₹4,000/-, తృతీయ బహుమతిగా ₹3,000/- నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు.ఆదిలాబాదు జిల్లా, పరిసర ప్రాంతాలలోని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకుని జిల్లా పర్యాటక రంగాన్ని ముందుకు తీసుకెళ్లడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## ఘనమైన చరిత్ర కల్గిన మెదక్ జిల్లాను టూరిస్ట్ హబ్ గా తీర్చిదిద్దాలి

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్




**మెదక్ మే19( సమయం న్యూస్). :** చారిత్రక -- సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతగామెదక్ జిల్లాకు వేల ఏళ్ల చరిత్ర, అపారమైన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆచారాలు గొప్ప గుర్తింపు ఉందని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలను, వారసత్వ సంపదను కాపాడుకోవాలనీ ఏ ం × పాఠశాలలోని ఆడిటోరియంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ...పూర్వీకులు నిర్మించిన దేవాలయాలు, కోటలు,మసీదులు, పురాతన కట్టడాలు, జానపద కళలు, భాషలు, సాహిత్యం, సంప్రదాయ పండుగలు మన చారిత్రక మరియు సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయన్నారు. వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చరిత్ర అనేది కేవలం గతాన్ని గుర్తుచేసేది మాత్రమే కాదు, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం కూడా. మన పూర్వీకుల త్యాగాలు, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, కళా వైభవం సమాజ అభివృద్ధికి పునాది వంటివని తెలిపారు. మన సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు ఉండటానికి మన పురాతన సంపద, వైవిధ్యభరితమైన సంప్రదాయాలే కారణమని వివరించారు.మునిపల్ ఛైర్పర్సన్ కనుగుల రాధిక భూపతి రాజ్ మాట్లాడుతూ..యువత తమ సంస్కృతి, చరిత్ర పట్ల అవగాహన పెంచుకొని వాటి పరిరక్షణలో ముందుండాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో చారిత్రక వారసత్వంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి మాట్లాడుతూ...పురాతన దేవాలయాలు, శిల్పాలు, చారిత్రక కట్టడాలను రక్షించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. పర్యాటక అభివృద్ధితో పాటు చారిత్రక ప్రాంతాల పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. చారిత్రక సంపదను కాపాడితేనే భవిష్యత్ తరాలకు మన గొప్ప సంస్కృతి అందుతుందని తెలిపారు.మన సంస్కృతి మన ఆత్మగౌరవానికి ప్రతీక అని, భాష, సాహిత్యం, కళలు, సంప్రదాయాలు నిలిచి ఉంటేనే సమాజం బలంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో స్థానిక చరిత్ర, పురాతన సంపద, కళలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు,కవులు,రచయితలు, ఉపాధ్యాయులు,పౌరులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## చిన్నారులతో బిక్షాటన కనిపిస్తే వెంటనే 1098కు సమాచారం ఇవ్వండి

● చైల్డ్ హెల్ప్ లైన్ అవగాహన కార్యక్రమం






**కరీంనగర్, మే 19: ( సమయం న్యూస్) :** చిన్న పిల్లలను ఎత్తుకొని బిక్షాటన చేయించడం గమనించిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు సమాచారం అందించాలని చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ కోరారు.కరీంనగర్ బస్టాండ్ పరిసరాల్లో చిన్నారులతో బిక్షాటన జరుగుతోందన్న సమాచారం మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 బృందం మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా బస్సుల్లో 1098 స్టిక్కర్లు అతికించి ప్రయాణికులు, డ్రైవర్లు, కండక్టర్లు, ఔట్‌పోస్ట్ పోలీసులకు అవగాహన కల్పించారు.చిన్నారులతో బిక్షాటన చేయించడం, తప్పిపోయిన పిల్లలు, ఇంటి నుంచి పారిపోయిన పిల్లలు లేదా ఒంటరిగా కనిపించే బాలబాలికలు గమనించిన వెంటనే 1098 ఉచిత సేవా నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ బృంద సభ్యులు సుందరగిరి సాయికిరణ్ గౌడ్, ఎడ్ల ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతల సమస్యకు అప్పటికప్పుడే పరిష్కారం

● జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్



**ధన్వాడ మండలం, మే,19(సమయం న్యూస్) :** తమకు న్యాయం చేయాలని కోరిన అన్నదాతలకు జిల్లా పాలన అధికారి అప్పటికప్పుడే స్పందించి పరిష్కారం చూపేందుకు సంబంధిత అధికారికి ఫోన్ చేసి అక్కడిక్కడే ఆదేశాలు జారీ చేశారు.మంగళవారం ధన్వాడ ఎస్సీ బాలుర వసతి గృహ పరిశీలనకు వచ్చిన కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ను మండలానికి చెందిన కొంత మంది రైతులు కలసి తాము కొనుగోలు కేంద్రంలో విక్రయించిన ధ్యానం లో మరికల్ వేంకటేశ్వర రైస్ మిల్లు యజమాని కోత విధించినట్లు రైతులు కలెక్టర్ తో మొర పెట్టుకున్నారు. స్పందించిన కలెక్టర్ వెంటనే సివిల్ సప్లై అధికారి బాల్ రాజ్ కు ఫోన్ చేసి ధన్వాడ రైతులకు వెంకటేశ్వర రైస్ మిల్లు యజమాని విధించిన కోత పై విచారణ చేసి సాయంత్రం వరకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రైతులకు న్యాయం చేయాలని అధికారికి సూచించారు.దీంతో ఆ రైతులు కలెక్టర్ కు వినమ్రత తో కృతజ్ఞతలు తెలిపారు.

# పండించిన పంటలను ఆంక్షలు లేకుండా కొనాలి కొనుగోళ్లలో వేగవంతం పెంచాలి

**● వంటేరు ప్రతాప్ రెడ్డి గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్**



**సమయం న్యూస్ గజ్వేల్ మే 19 :** గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం పంటలను పొద్దు తిరుగుడు పంటలను పరిశీలించిన వంటేరు ప్రతాప్ రెడ్డి పంటలను పరిశీలిస్తున్నప్పుడు రైతులు తమ తమ గోడు వెళ్ళబోసుకొని కన్నీళ్లు తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, రైతులకు పండించిన ధాన్యం కొనుగోల కోసం 45 డిగ్రీల ఎర్రటి ఎండలో రైతులు పడిగాపులు కాయించడం చాలా బాధాకరమన్నారు, అధికారులు, రైస్ మిల్లర్లు, దళారీలు వ్యవస్థ కుమ్మక్కై రైతులను ఆంక్షలతో నట్టేట ముంచుతున్నారని మండిపడ్డారు. పొద్దు తిరుగుడు పంటలను మార్కెట్ యార్డుకు తరలించి రెండు నెలలు గడుస్తున్న కొనుగోలు చేయకపోవడం చాలా బాధాకరం, లారీలు సకాలంలో రాకపోవడం వలన, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వలన, రైస్ మిల్లర్లు కొర్రీలు పెట్టడం వలన, తేమశాతం తరుగు పేరుతో కోతలు విధిస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందుల గురిచేస్తుందని, నెల రోజులుగా వరి ధాన్యం రోడ్లపై కల్లాలపై ఉండటం వలన విపరీతమైన ఎండలకు 45 డిగ్రీల సైతం లెక్కచేయకుండా రైతులు తమ వరి ధాన్యం ఎండబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకుపోయిన ఫలితం లేనివిధంగా రైతుల పంటలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం చాలా బాధాకరం అన్నారు మక్క రైతులు పొద్దుతిరుగుడు పువ్వు రైతులు 2నెలలుగా మార్కెట్ యార్డులకు తమ పంటలను తరలించి పంటలను కొనుగోలు చేయాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసిన, మొకరిల్లిన రైతుల పంటలను కొనుగోలు చేయకపోవడం చాలా బాధాకరమని అన్నారు, అన్నింట నష్టాలు చవిచూస్తున్న రైతుల కష్టాలు కన్నీళ్లతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కనుమరుగైతుందని అన్నారు ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కళ్ళు తెరిచి కొనుగోలు కేంద్రాలలో వచ్చిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రాజీవ్ రహదారులను పెద్ద ఎత్తున వేలాది మంది రైతులతో రాజీవ్ రహదారి దిగ్బంధం చేసి వంటావార్పు కార్యక్రమం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరుస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మేరా, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, మాజీ జెడ్పిటిసి బొల్లారం ఎల్లయ్య, కౌన్సిలర్లు మామిడి శ్రీధర్, కాముని మురళి, కోట బాబు, మమతా పోచయ్య, మాజీ కౌన్సిలర్ మరికంటి కనకయ్య, సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు మద్ది రాజ్ రెడ్డి, గలెంక నర్సింలు, అశోక్ రావు పాల రమేష్ గౌడ్, రఘుపతి రెడ్డి తదితరులు ఉన్నారు

# బ్యాంకుల వద్ద భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలి

**● టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు**

**● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు**




**నారాయణపేట, మే,19(సమయం న్యూస్) :** నారాయణపేట: జిల్లా కేంద్రంలోని వివిధ బ్యాంకుల వద్ద టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నారాయణపేట పోలీసులు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించి, బ్యాంకు అధికారులకు మరియు ఖాతాదారులకు భద్రతాపరమైన సూచనలు చేశారు. బ్యాంకులకు వచ్చే ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ నగదు, ఆభరణాలు మరియు వ్యక్తిగత సమాచారాన్ని సురక్షితంగా కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... బ్యాంకుల వద్ద ఇటీవల మోసాలు, చోరీలు, సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఓటీపీలు, ఏటీఎం పిన్ నంబర్లు, పాస్‌వర్డ్‌లు ఎవరికీ చెప్పకూడదని సూచించారు. అపరిచిత వ్యక్తులు సహాయం చేస్తామని చెప్పి ఏటీఎం కార్డులు తీసుకోవడం, ఫోన్‌లో వివరాలు అడగడం వంటి ఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బ్యాంకులకు పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లే వారు లేదా తీసుకువచ్చే వారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే పోలీసుల సహాయం పొందవచ్చని చెప్పారు. బ్యాంకుల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా బ్యాంకు అధికారులు బ్యాంకుల వద్ద సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. బ్యాంకుల వద్ద పార్కింగ్ ప్రాంతాల్లో కూడా పర్యవేక్షణ పెంచాలని తెలిపారు. ప్రజలు నగదు లావాదేవీల సమయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, మోసగాళ్ల మాటలకు మోసపోవద్దని ఎస్సై హెచ్చరించారు. సైబర్ మోసాల బారిన పడిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట టౌన్ పోలీస్ సిబ్బంది, బ్యాంకు మేనేజర్లు, సెక్యూరిటీ సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.

# బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి తక్షణ చర్యలుతీసుకోవాలని

**● జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు.**






**వికారాబాద్, మే,19(సమయం న్యూస్) :** మంగళవారం వీడియో కాన్ఫరెన్సు హాలు లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బీఎల్ఏ ల నియామకం జాబితాను నిర్ణీత ఫార్మాట్ ప్రకారం అందించాల్సిందిగా రాజకీయ పార్టీలను మరోమారు లిఖిత పూర్వకంగా లేఖల ద్వారా ఇవ్వాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ అమలు తీరుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలలో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ నిర్ణీత లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయడం జరిగిందనితెలిపారు. ఎస్.ఐ.ఆర్ అమలు కోసం ఎన్నికల సంఘం షెడ్యుల్ ను వెలువరించిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు తప్పనిసరిగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించి నిర్ణీత ఫార్మాట్ లో వారి వివరాలు సమర్పించేలా చూడాలన్నారు. ఎస్.ఐ.ఆర్ షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో బీ.ఎల్.ఓల సత్వర నియామకం ఆవశ్యకత గురించి నొక్కి చెప్పాలని, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్ ల పరిధిలో బీ.ఎల్.ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పక్కాగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్ళిన, రెండు చోట్ల పేర్లు కలిగిన ఓటర్లను మ్యాపింగ్ సందర్భంగా ఖచ్చితంగా గుర్తించేలా చూడాలన్నారు. తప్పులు లేకుండా ఎన్యుమరేషన్ ఫారం ఎలా నింపాలి అనే దానిపై బీ.ఎల్.ఓలకు శిక్షణ అందించాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారంల పంపిణీ జూన్ 15వ తేదీ లోపు పూర్తి అయ్యేలా ప్రణాళికాబద్దంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని పోలింగ్ బూత్ ల పరిధిలో ప్రముఖుల ఓటరు మ్యాపింగ్ పూర్తయ్యిందా లేదా అన్నది ఈ.ఆర్.ఓలు స్వయంగా పరిశీలన జరపాలని సూచించారు. ఆయా నియోజక వర్గాలలో పోలింగ్ కేంద్రాల వారీగా బీ.ఎల్.ఓల పేరు, ఫోన్ నెంబర్లతో కూడిన వివరాలను ఓటర్లకు తెలిసేలా విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలన్నారు. ఎస్.ఐ.ఆర్ అమలు కావడానికి ముందే జూన్ 5వ తేదీ లోపు అన్ని క్లెయిమ్ లు పరిష్కారం కావాలని గడువు విధించారు. మ్యాపింగ్ లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఉమాశంకర్ ప్రసాద్, వెంకటా చారి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నేమత్ అలీ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి

**● జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



**నిర్మల్ మే19( సమయం న్యూస్) :** జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లాలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండలాల వారి జిల్లాలో ఇప్పటి వరకు పూర్తిచేసిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని అన్నారు. అందుబాటులో లేని రైతులకు సంబంధించి వివరాలను వివిధ మార్గాల్లో అన్వేషించాలని సూచించారు. రిజిస్ట్రీ ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సంబంధమైన ఇబ్బందులు ఉంటే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ మొత్తం ఎటువంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఇతర అధికారులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల గణన ప్రక్రియ పారదర్శకంగా, కచ్చితంగా జరగాలి

**● జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ మే19( సమయం న్యూస్) :** జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని లిజిల్లా కలెక్టర్ అన్నారు

రేగోడ్ మండలకేంద్రం లోనీ కొత్వాన్ పల్లి లో జరుగుతున్న ఇండ్ల గణన ప్రక్రియని మంగళవారం కలెక్టర్ పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్యూమారేటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ...ఇంటింటి సర్వే సక్రమంగా, పారదర్శకంగా జరిగేలా చూడటం ఎన్యుమరేటర్ల ప్రధాన బాధ్యత అని తెలిపారు నిర్దేశిత నిబంధనల ప్రకారం.. మొబైల్ యాప్ ద్వారా స్పష్టమైన, కచ్చితమైన వివరాలను సేకరించాలాన్నారు మొదటి దశలో మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ఇళ్ల గణన నిర్వహిస్తారని, ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి, నమోదు చేయాలని ఆదేశించారు. అందరి వివరా లు గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు. ఎండాకాలం నేపథ్యంలో ఓ ఆర్ఎస్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్ వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ప్రజలు కూడా ఎన్యూమరేటర్లు అడిగే ప్రశ్నలకు ఎలాంటి దాపరికం లేకుండా ఖచ్చితమైన సమాధానాలు చెప్పాలని.... దీనివల్ల ప్రభుత్వానికి సరైన లెక్కలు అందుతాయన్నారు

# పుచ్చలపల్లి సుందరయ్య (1913 -- 1985) ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు,

**● తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు.**

**● సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బుస్సు చంద్రయ్య,**



**దుద్యాల మండలం, మే,19(సమయం న్యూస్) :** కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన సుందరయ్య తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడు. కులవ్యవస్థను నిరసించిన ఇతను అసలు పేరు పుచ్చలపల్లి సుందరరామిరెడ్డి లోని రెడ్డి అనే కులసూచికను తొలగించుకున్నాడు. సహచరులు ఇతనును "కామ్రేడ్ పి.ఎస్." అని పిలిచేవారు.ళి1ర ఇతను నిరాడంబరతతో ఆదర్శ జీవితం గడిపాడు. స్వాతంత్ర్య సమరంలోని అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. సుందరయ్య భార్య కూడా సీపీఐ-ఎంలోని ముఖ్య నాయకురాలు. తెలంగాణ ప్రజల పోరాటం - దాని పాఠాలు, విశాలాంధ్రలో ప్రజారాజ్యం వంటి పుస్తకాలు, నివేదికలు రాశాడు. పార్లమెంటు సభ్యునిగా సుదీర్ఘ కాలం పనిచేశాడు, ఆ సమయంలో పార్లమెంటుకు కూడా సైకిల్ మీద వెళ్ళేవాడు. ఒక మహాసభ సందర్భంగా సభా ప్రాంగణంలో మలవిసర్జన చేస్తున్న వ్యక్తులను ఇది తగదని తెలిపిన వినకపోవడంతో తానే స్వయంగా చేతులతో ఎత్తి మలవిసర్జన దూరంగా పడవేసిన మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య. ఈ కార్యక్రమము దుద్యాల మండల కేంద్రంలో జరిగింది సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు. బు స్స చంద్రయ్య నాయకులు కావలి సురేష్ వెంకటయ్య సాయిలు రాములు మల్లప్ప ఎస్ రాములు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

# అత్తెల్లి ప్రవీణ్ జ్యోతి దంపతుల మృతి బాధాకరం - చాగండ్ల నరేంద్రనాథ్

- మృతుల కుటుంబానికి 5 లక్షలు అందజేసిన చాగండ్ల నరేంద్రనాథ్
- శోకసముద్రంగా మారిన షేర్ పల్లి గ్రామం



**సమయం న్యూస్ గజ్వేల్ మే 19 :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం షేర్ పల్లి గ్రామానికి చెందిన ఆర్యవైశ్య నాయకుడు అత్తెల్లి ప్రవీణ్ జ్యోతి దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి చిందిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగండ్ల నరేంద్రనాథ్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు, అత్తెల్లి ప్రవీణ్ జ్యోతి మరణం తీరని లోటు అని వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ, మంచి మనిషి అందరి మన్నన పొందిన అత్తెల్లి ప్రవీణ్ నాకు మించి ఆత్మీయుడు అని, చిన్న వయసులోనే తిరిగిరాని లోకాలకు వెళ్లడం బాధాకరం అని అన్నారు, వారితో పాటు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్,నాయకులు దుర్గాప్రసాద్ తుమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# సుందరయ్య జీవితం ఆదర్శం

- ప్రజా సమస్యల పోరాటంతో పాటు, సామాజిక, సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలి
- సందబోయిన ఎల్లయ్య సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు



**సమయం న్యూస్ గజ్వేల్ మే 19 :** భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం అఖిల భారత మొదటి ప్రధాన కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్లయ్య మాట్లాడుతూ సుందరయ్య ఉన్నత భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సామాన్య పీడత వర్గాల కోసం జీవితాంతం పని చేశారని అన్నారు. మొదటి పార్లమెంట్ ప్రతిపక్ష నేతగా, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఎమ్మెల్యేగా అనేక ప్రజా సమస్యలపై చర్చించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని అన్నారు ప్రజా ఉద్యమాలు పోరాటాలు కాకుండా, సామాజిక అణిచివేత, వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారని, ధరలు పెరిగినప్పుడు పేదలకు తక్కువ ధరకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం, వ్యాధులు ప్రబలినప్పుడు గోళీలు మందులు ప్రజలకు అందించడం మహిళల హాస్పిటల్ లో ప్రసవాలు చేసే విధంగా అవగాహన కల్పించడం, చెరువుల తవ్వకాలు మరమ్మతులు చేయించడం అనేక రూపాలలో సామాజిక సేవ కార్యక్రమాలు చేశారని అన్నారు. సుందరయ్య గారి స్ఫూర్తితో మతోన్మాద కార్పొరేట్ కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాటంలో నిర్వహించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రంగారెడ్డి ఐలయ్య ప్రవీణ్ వంశీ తదితరు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను. నిర్మూలించాలి

- పేరలీగల్ వలంటీర్ కె.యాదమ్మ





**నారాయణపేట,మే,19(సమయం న్యూస్) :** నారాయణపేట సుభాస్ రోడ్ ఏరియాలో బాల్యవివాహ లపై న్యాయ అధికార సేవ సవస్థ నారాయనపేట్ వారి ఆద్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.బాలికల. వయసు 18 దాటిన తర్వాత నే పెల్లి చేయాలి అంతకంటే ముందు చేసినచో. చట్టపరంగా అందరూపై కేసు నమోదు చేయడం జరిగుతుంది అందుకే. మంచిగాచదివించి నా తర్వాత పెళ్లి నిర్ణయానికి రావాలి అటువంటి సంఘటనలు మీ దృష్టి లో అంటూ ఉంటే వెంటనే 1098 100 15100 కి ఫోన్ ద్వారా తెలియ జేయాలని. పేరలీగల్ వాలంటీర్ కె. యాదమ్మ అవగాహన కల్పించడం ఈ కార్యక్రమంలో వార్డు మహిళలు పాల్గొన్నారు


# సిఎస్ డైరెక్టర్ కు కవుల సన్మానం



**హైదరాబాద్, మే 19సమయం న్యూస్ :** పౌరసరఫరా శాఖ రాష్ట్ర సంచాలకులుగా ఇటీవల పదోన్నతి పొందిన జి.వి.శ్యాంప్రసాద్ లాల్ ను "కవి సాయంత్రం" కవులు ఘనంగా సన్మానించారు.ఈ మేరకు నగరంలోని ఎర్రమంజిల్ లో గల పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో మంగళవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంచలంచలుగా పదోన్నతి పొందడం ఆయన క్రమశిక్షణకు, కార్యదీక్షకు నిదర్శనం అని అన్నారు. రానున్న కాలంలో వారు మరింత ఉన్నతంగా ఎదిగి మహోన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కవి సాయంత్రం గ్రూప్ అధ్యక్షులు ముక్కెర సంపత్ కుమార్, హైదరాబాద్ మహానగర పట్టణ అధ్యక్షురాలు బేతి కవిత, సినీగేకవి మౌనశ్రీ మల్లిక్, సీనియర్ పాత్రికేయులు బోయిన భాస్కర్, జలమండలి పిఆర్ఓ సుభాష్ చంద్రబోస్, కవులు దేవర కనకయ్య, వాసుదేవ, చేపూరి కుమార్, రవి ప్రసాద్ సాండేసరి, నూకల అశోక్ యాదవ్, పండరీనాథ్, అరుణోదయ నిర్మల, శ్రావ్య సాయి తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ సమస్యలపై కేసీఆర్‌కు బీజేపీ నేత బహిరంగ లేఖ

**సమయం న్యూస్ గజ్వేల్ మే19**



మల్లన్నసాగర్ నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించాలి.. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయాలి: కమ్మరి శ్రీను గజ్వేల్ పట్టణం, నియోజకవర్గంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలు, అసంపూర్తి అభివృద్ధి పనులు, మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లింపుపై స్పందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకుడు కమ్మరి శ్రీను మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కు బహిరంగ లేఖ రాశారు.గజ్వేల్ పట్టణంలో మౌలిక వసతుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్య సమస్యలపై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన లేఖలో పేర్కొన్నారు. గతంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు అనేకం ఇప్పటికీ పూర్తికాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితమయ్యాయంటూ విమర్శించారు.ప్రత్యేకంగా మల్లన్నసాగర్ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన రైతులు, నిర్వాసిత కుటుంబాలకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో పరిహారం అందలేదని, ఆర్థిక ఇబ్బందులతో బాధితులు తీవ్ర ఇనుమడింపులో ఉన్నారని కమ్మరి శ్రీను పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు నిర్వాసితులకు పూర్తి నష్టపరిహారం వెంటనే అందించి వారికి న్యాయం చేయాలని కోరారు.అదేవిధంగా పేద మహిళలకు వర్తించే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద అర్హులకు చెక్కులు అందాల్సి ఉన్నప్పటికీ ఇంకా అనేక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెక్కులు పంపిణీ చేసి పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా కమ్మరి శ్రీను మాట్లాడుతూ.. గజ్వేల్ పట్టణం నియోజకవర్గంలో ఉన్న ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకొని కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. తాను రాసిన లేఖను హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌కు, అలాగే కేసీఆర్ ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి పోస్టు ద్వారా పంపినట్లు తెలిపారు. తమ లేఖపై కేసీఆర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# తెలంగాణ బ్యాడ్మింటన్‌కు మరో స్వర్ణ కిరీటాలు






**హైదరాబాద్, క్రీడా ప్రతినిధి, మే 19:** గోవాలో జరిగిన ప్రతిష్టాత్మక యోనెక్స్ సన్‌రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ అండర్-13 ర్యాంకింగ్ టోర్నమెంట్ లో తెలంగాణకు చెందిన యువ బ్యాడ్మింటన్ క్రీడాకారులు షాన్వి రెడ్డి నిమ్మా , అయోషా కోరుకొండ అద్భుత ప్రతిభ కనబరిచి సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించి తెలంగాణ క్రీడా వైభవాన్ని జాతీయ స్థాయిలో మరోసారి చాటిచెప్పారు. అలాగే అండర్-13 బాలుర విభాగంలో ఆరోర కూడా స్వర్ణ పతకం సాధించి తెలంగాణకు మరింత గౌరవాన్ని తీసుకొచ్చారు.టోర్నమెంట్ మొత్తం అసాధారణ ఆటతీరుతో ప్రత్యర్థులను అధిగమిస్తూ ఫైనల్ వరకు అజేయ ప్రదర్శన కనబరిచిన ఈ యువ క్రీడాకారులు అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. చిన్న వయసులోనే ఒత్తిడిని తట్టుకొని చూపించిన ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదల వారి విజయాలకు ప్రధాన బలంగా నిలిచాయని కోచ్‌లు పేర్కొన్నారు.తెలంగాణ నుంచి జాతీయ స్థాయిలో వరుస విజయాలు సాధిస్తున్న ఈ యువ క్రీడాకారులు భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపై కూడా దేశానికి పతకాలు తీసుకురావాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు. రాష్ట్ర యువతకు ఆదర్శంగా నిలుస్తున్న ఈ విజయాలు మరెందరో చిన్నారుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తున్నాయని క్రీడా వర్గాలు పేర్కొన్నాయి.ఈ సందర్భంగా షాన్వి రెడ్డి నిమ్మా, అయోషా కోరుకొండ మరియు ఆరోరలను బ్యాడ్మింటన్ క్రీడా ప్రతినిధులు, కోచ్‌లు, మాజీ క్రీడాకారులు, క్రీడాభిమానులు హృదయపూర్వకంగా అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో బాగంగా.

- జిల్లా పరిదిలో జిల్లా స్తాయీ సభను ఏర్పాటు చేయాలి- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి






**వికారాబాద్, మే 19(సమయం న్యూస్):** వీడియో కాన్ఫరెన్సు హాలు లో మంగళవారం వివిధ శాఖ ల జిల్లా అధికారుల తో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిదిలో ఉన్న జిల్లాలో ఉండే వివిధ శాఖ ల అధికారులు జిల్లా స్థాయీ డేటా ఇవ్వాలని,వివిధ శాఖ లలో ప్రభుత్వము చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలపై చేసిన పురోగతి పై వివరించాలని సూచించారు.ఇప్పటివరకు గ్రామ, మండల, నియోజకవర్గం పరిదిలో సభలు నిర్వహించామని, ఆరోగ్యం, వ్యవసాయం, విద్యా వారోత్సవాలు, వెల్ఫేర్ వీక్, బడిబాట, క్రీడలు, టూరిజం, వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలు రైతు భరోసా,రైతు భీమా , ఇందిరమ్మ ఇండ్లు, మహా లక్ష్మి, మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి , సన్నరకం వరికీ బోనస్, చేయూత పెన్షన్లు , కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అన్ని పథకాలపై జరిగిన పురోగతి ని సంబంధిత శాఖ అధికారి చదివి వినిపించాలన్నారు.జిల్లా సభ నిర్వహణకు ప్రోటోకాల్ ప్రకారం అతిదులను ఆహ్వానించాలని, ప్రోటోకాల్ వంద శాతం అమలు చేయాలనీ జిల్లా సభ నిర్వహణలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలనీ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జడ్ పి సి ఇ ఓ సుదీర్, డి ఆర్ డి ఎ శ్రీనివాస్, సి పి ఓ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

# వృద్ధాశ్రమం మరియు బాలసదనం ఆకస్మిక తనిఖీ.

- సిబ్బంది అందుబాటులో ఉండి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి
- సీనియర్ సివిల్ జడ్జి-వింధ్య నాయక్





**నారాయణపేట, మే,19(సమయం న్యూస్) :** నారాయణపేట పట్టణంలోని బారం బావి దగ్గర ఉన్న వృద్ధాశ్రమం మరియు బాలసదనం హోమ్ నీ సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ మంగళవారం అకస్మాత్తుగా తనకి చేశారు. ఈ సందర్భంగా అందరు హోమ్ లో ఉన్నారా హాజరు పట్టికను పరిశీలించారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి ఆదేశించారు. తదుపరి వృద్ధులని ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హోమ్ లో ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ వృద్ధులకి మరియు చిల్డ్రన్స్ కి ఎలాంటి సమస్యలు ఉన్నా కూడా సంబంధిత అధికారికి వెంబడే తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించారు. రోజు ఆహార దిన పట్టికను అడిగి వసతులను,దిన వస్తువులను ఆహార ధాన్యాల నాణ్యత మరియు త్రాగు నీరు, పరిశుభ్రత, రిజిస్టర్లను, సీసీటీవీ ఫుటేజ్ లను, మూవ్మెంట్ రిజిస్టర్స్, ఆఫీస్ ఆర్డర్స్ ప్రకారం అడ్మిషన్స్ తీసుకుంటున్నారా, ఆఫీసర్ ఆర్డర్ ప్రకారము సంబంధించిన వాళ్ళకు అప్పచెపుతున్నారా లేదా తగిన రిజిస్టర్లు చూశారు. వచ్చిన సరుకులు, రైస్ క్వాంటిటీ రిజిస్టర్ లో వ్రాస్తున్నారా, డైలీ డైరీ, రిజిస్టటర్స్, గవర్నమెంట్ వాళ్ళు ఇచ్చిన మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా, ప్రతి రోజు రోజు కూరగాయలు ఫ్రెష్ గా కొనుగోలు చేయమని సిబ్బందికి ఆదేశించారు. ఎప్పటికప్పుడు టాబ్లెట్స్, సిరాఫ్ లు ఎక్సపైరీ డేట్ చూసారు, బెడ్ షీట్స్, రూమ్స్, బాత్రూమ్, వాష్రూమ్స్ ఎప్పటికప్పుడు క్లీన్ గా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. లైట్స్ మరియు ఫాన్స్ వర్కింగ్ లో ఉన్నాయ చూసారు, ఏలాంటి వస్తువులు తీసుకున్న తగిన బిల్లులు తీసుకొని రిజిస్టర్ లో ఎంటర్ చేయాలన్నారు, ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాత్రూమ్స్, బెడ్ రూమ్స్ క్లీన్గా ఉంచాలన్నారు. చిల్డ్రన్స్ కి మరియు వృద్దులకు అరటి పండ్లని అందజేశారు. సొంత బంధువులు గాని మిగతా ఇంకెవరైనా ఉన్నారా అలాగే పిల్లలు మరియు వృద్ధుల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడుతూ 24 హౌర్స్ అందుబాటులో ఉండి వాళ్లకి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సిబ్బందినీ ఆదేశించారు.

# జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించిన కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, మే.19(సమయం న్యూస్) :** జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దిపాక్ తివారి సూచించారు. మంగళవారం కలెక్టర్ అదనపు కలెక్టర్ వెంకటాచారి లతో కలిసి వెంకటరమణ ఇండాస్ట్రీస్, కామ రెడ్డి గూడ రైస్ మిల్లు ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎక్కువ మంది హమాలిలను ఏర్పాటు చేసుకొని రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని తక్షణమే స్వీకరించి, నాణ్యత ప్రమాణాల ప్రకారం మిల్లింగ్ ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యం నిల్వలు ధాన్యం రవాణా, హమాలి, మిల్లింగ్ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, వరి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి మిల్లు దగ్గర సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేస్తారని , మీకున్న లక్ష్యాన్ని పూర్తి చేయాలనీ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటా చారి, పోలీస్ అధికారులు,పౌర సరఫరాల శాఖ అధికారులు, మోహన్ కృష్ణ,సుదర్శన్ , మిల్లు యాజమాన్యం పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలి

-జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.




**నారాయణపేట, మే,19(సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం గత మార్చి 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా ఇప్పటి వరకు 10 థీమ్స్ తో జిల్లాలో ఇప్పటి వరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరిట వివిధ కార్యక్రమాలు గ్రామ, మండల, నియోజక వర్గ స్థాయి లో నిర్వహించడం జరిగిందని ఈ నెల 22 జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. మంగళ వారం జిల్లా కలెక్టర్ లోని వీసీ హాల్ లో అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో జిల్లా స్థాయి కార్యక్రమ ఏర్పాట్ల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇప్పటి వరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ఫోటోలు, ఆయా పథకాల ద్వారా లబ్ది పొందిన లబ్ధిదారుల జాబితాలను, ఆయా పథకాలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలను సిద్ధంగా ఉ ంచుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఆయా శాఖల అధికారులు స్టాళ్ళను ఏర్పాటు చేయాలన్నారు. శాఖల వారీగా అధికారులు సమన్వయంతో జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమానికి స్క్రీన్, సౌండ్ సిస్టం తహసిల్దార్ తో సమన్వయం చేసుకోవాలని డీపీ ఆర్వో రషీద్ కు సూచించారు. అలాగే స్నాక్స్, భోజన ఏర్పాట్ల ను చూసుకోవాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు.

**రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలి**

వచ్చే నెల జూన్ 2 న రాష్ట్ర అవతరణ దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. వీసీ హాల్ లో సంబంధిత అధికారులతో రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై ఆమె సమీక్ష జరిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి అవతరణ దినోత్సవ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఎక్కడా చిన్న పొరపాటు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వేడుకలకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారికి సూచించారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కి, గార్డ్ ఆఫ్ హానర్ పోలీసు శాఖ, స్టేజ్, మైక్ సౌండ్ సిస్టం, జిల్లా ప్రగతి నివేదిక ను సిద్ధం చేయాలని సీపీవో ను ఆదేశించారు. ఆయా కార్యక్రమాలలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, జెడ్పీ సీఈవో శ్రీనివాస్ రావు, డి ఆర్ డి ఓ వెంకట్ రాములు, ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, ఆర్డీవో రమేష్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సదాశివపల్లిలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం పరిశీలన

- ప్రజలు ఉచిత ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ




**కరీంనగర్, జూన్ 19:( సమయం న్యూస్). :** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, పీవో డీటీటీ డాక్టర్ ఉమాశ్రీతో కలిసి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హౌసింగ్ బోర్డ్ పరిధిలోని సదాశివపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా శిబిరంలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిబిరంలో క్యాన్సర్ లక్షణాలు కలిగిన ఇద్దరు, బీపీ లక్షణాలు ఉన్న 27 మంది, షుగర్ లక్షణాలు ఉన్న 14 మందిని గుర్తించినట్లు తెలిపారు. వ్యాధుల నివారణ చర్యలు, సమయానికి పరీక్షలు చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే 14 సంవత్సరాలు నిండిన బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించారు. ఈ కార్యక్రమంలో పీవో ఎన్‌సీడీ డాక్టర్ విప్లవశ్రీ, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రాజ్‌కుమార్, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ పోచయ్య, హెచ్ఈఓ జీవన్‌రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

Sd/-జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి, కరీంనగర్

# పారదర్శకంగా ఖాళీల భర్తీ

- జిల్లా కలెక్టర్ కె. హరిత



**ఆసిఫాబాద్ మే 19,( సమయం న్యూస్) :** జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రంలో ఖాళీలను పొరుగు సేవల ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలు పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ఇంటర్వ్యూ లకు కమిటీ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రంలో పొరుగు సేవల ప్రాతిపరికన పని చేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి ప్రతిభ ఆధారంగా భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. 1 సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుకు 8 దరఖాస్తులు రాగా 8 మంది, 1 న్యాయ సలహాదారు పోస్టుకు 4 దరఖాస్తులు రాగా 4 మంది, 1 కేస్ వర్కర్ పోస్టుకు 6 దరఖాస్తులు రాగా 6 మంది, 1 ఐ.టి. అసిస్టెంట్- అకౌంటెంట్ పోస్ట్ కు 6 దరఖాస్తులు రాగా 6 మంది, 1 మల్టీపర్పస్ వర్కర్ పోస్టుకు 47 దరఖాస్తులు రాగా 32 మంది హాజరయ్యారని తెలిపారు. అభ్యర్థులలో అర్హత గల వారిని ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యాన్ని చేరుకోవాలి

- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.



**నారాయణపేట, మే,19(సమయం న్యూస్) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మక్తల్ నియోజక వర్గంలోని మండలాలకు నిర్దేశించిన ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యం, సాధన పై జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మక్తల్ నియోజక వర్గానికి ఇచ్చిన లక్ష్యం, ఇప్పటి వరకు సాధించిన ప్రగతి పై చర్చించారు. మండలాల వారీగా, గ్రామాల వారీగా మంజూరైన ఇండ్లు, ప్రస్తుతం వాటి పరిస్థితి నీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో చర్చించి, ఎందుకు వెనక బడి ఉన్నారో సంజాయిషి కోరారు. పంచాయతీ కార్యదర్శులకు గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకమే ప్రధానం అని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయని సున్నితంగా హెచ్చరించారు. అలాగే ఎంపీడీవోలు సైతం క్షేత్రస్థాయిలో పర్యటించి ఇండ్ల నిర్మాణాలను వేగిరం చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. లబ్ధిదారులకు రుణాలు ఇప్పించి నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. మక్తల్ నియోజక వర్గంలో నర్వ మండలం ఇండ్ల నిర్మాణం లో కాస్త ముందు వరసలో ఉందని, చివరి వరసలో మక్తల్ పట్టణం ఉందని కలెక్టర్ తెలిపారు. ఆయా మండలాల ఇన్ ఛార్జ్ లు, హౌసింగ్ ఏ ఈ లు నిర్మాణాలలో వేగం పెంచేందుకు కృషి చేయాలని చెప్పారు. రాష్ట్ర అవతరణ దినం రోజున మళ్ళీ కొత్తగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యే అవకాశం ఉందని, అంతలోపు ఉన్న ఇండ్ల నిర్మాణాల లక్ష్యాన్ని సాధించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీడీవోలు, హౌసింగ్ ఏ ఈ లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి ఇంటర్న షిప్పు పథకం ద్వారా నిరుద్యోగులు ఆర్థిక సహాయం పొందవచ్చు

- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్



**నారాయణపేట, మే,19(సమయం న్యూస్) :** ప్రధానమంత్రి ఇంటర్న షిప్పు పథకం ద్వారా నిరుద్యోగులు ఆర్థిక సహాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు. మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఇందుకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకం ద్వారా నెలకు రూ.9,000 ఆర్థిక సహాయం దొరుకుతుందన్నారు. అగ్రశ్రేణి కంపెనీలలో పెయిడ్ ఇంటర్న్ షిప్ కొరకు 18 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు కెరియర్ నిర్మించుకోవడం కోసం సిద్ధంగా ఉన్నట్లయితే వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు....

## ముమ్మరంగా 'హిందూ సమ్మేళనం' ఏర్పాట్లు.. 8 గ్రామాల్లో నిర్వాహకుల విస్తృత ప్రచారం!



**పోతంగల్, మే 19 ( సమయం న్యూస్ )** పోతంగల్ మండల కేద్రంలోని కల్లూరు గ్రామంలో మే 21న గురువారం నిర్వహించ తలపెట్టిన "హిందూ సమ్మేళనం" విజయవంతం కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను నిర్వాహకులు తాజాగా విడుదల చేశారు. ఈ మహాసభకు హిందూ బంధువులను ఆహ్వానించేందుకు కల్లూరు సమీపంలోని జల్లాపల్లి, జల్లాపల్లి ఫారం, ఓల్డ్ జల్లాపల్లి, గన్నారం, లింగాపూర్, బస్వాపూర్, భరంగ్, ఎడిగి గ్రామాల్లో నిర్వాహక బృందం విస్తృతంగా పర్యటించింది. గ్రామ గ్రామాన తిరుగుతూ భక్తులకు, హిందూ సోదరులకు సాదర నిమంత్రణలు అందజేశారు. ఈ వైభవ ఆధ్యాత్మిక సమ్మేళనానికి గీత ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీ శ్రీ విశోక కృష్ణ స్వామి వారు ముఖ్య అతిథిగా విచ్చేసి భక్తులకు అనుగ్రహ భాషణం చేయనున్నారు. అలాగే ప్రముఖ వక్త ఆర్మూర్ సతీష్ గారు హాజరై ముఖ్య ప్రసంగం చేయనున్నారు. కల్లూరు పరిసర ప్రాంతాల నుండి సుమారు 2,500 మందికి పైగా జనసమీకరణతో ఈ భారీ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్నామని, భగవద్బంధువులంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## జనగణన పకడ్బందీగా చేయాలి..

- జిల్లా అదునపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను




**దామరిగిద్ద మండలం, మే,19(సమయం న్యూస్) :** జనగణన పకడ్బందీగా చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను ఆదేశించారు. మంగళవారంఅదనపు కలెక్టర్ (రెవెన్యూ) దామరగిద్ద మండలం మాల్‌రెడ్డిపల్లి గ్రామంలో గణన అధికారి, గృహ సభ్యులతో సంభాషించారు. ఈ సంభాషణ సందర్భంగా ఒక కుటుంబాన్ని నమోదు చేయడానికి పడుతున్న సమయం గురించి గణన అధికారిని అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఏవైనా సమస్యల గురించి కూడా అదనపు కలెక్టర్ ఆరా తీశారు..



# ధోనీ భవితవ్యంపై ఉత్కంఠ

## వచ్చే సీజన్‌లో ఆడటంపై సందేహాలు

**చెన్నై, మే 19:** భారత క్రికెట్ దిగ్గజం, చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ భవిష్యత్తుపై మరోసారి చర్చ మొదలైంది. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడంతో ధోనీ ఇక ఆటకు పూర్తిగా వీడ్కోలు పలుకుతారా అనే సందేహాలు అభిమానుల్లో వ్యక్తమవుతున్నాయి. గాయం కారణంగా మొత్తం టోర్నీకి దూరమైన ధోనీ, ఇటీవల చెపాక్ స్టేడియంలో జరిగిన హైదరాబాద్ మ్యాచ్ సందర్భంగా మాత్రం జట్టుతో కలిసి కనిపించారు. అయితే మైదానంలో ఆటగాడిగా దిగకపోవడం అభిమానులను నిరాశకు గురి చేసింది. చెన్నై జట్టుకు ఇంకా ఒకే ఒక్క మ్యాచ్ మిగిలి ఉండగా, ప్లేఆఫ్స్ ఆశలు కూడా క్లిష్టంగా మారాయి. ఈ పరిస్థితుల్లో ధోనీ ఇకపై ఆటగాడిగా కొనసాగుతారా లేదా అన్న ప్రశ్న మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో ధోనీ మాజీ సహచరుడు, మాజీ క్రికెటర్ సురేశ్ రైనా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ కార్యక్రమంలో మాట్లాడిన రైనా.. తాను ధోనీతో వ్యక్తిగతంగా మాట్లాడిన విషయాలను వెల్లడించారు. "ఈ సీజన్‌లో గాయంతో ఆడలేదు కాబట్టి, వచ్చే ఏడాది అయినా తప్పకుండా ఆడాలని నేను ధోనీని కోరాను. అయితే శరీరం ఇప్పుడు పూర్తిగా సహకరించడం లేదని, గతంతో పోలిస్తే బలం కూడా తగ్గిందని ధోనీ చెప్పాడు" అని రైనా తెలిపారు. ధోనీ మాటలను బట్టి చూస్తే వచ్చే సీజన్‌లో కూడా అతడు ఆడే అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఇక చెన్నై సూపర్ కింగ్స్ ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కూడా ధోనీ భవిష్యత్తుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. "ధోనీ భవిష్యత్తుపై తుది నిర్ణయం జట్టు యాజమాన్యమే తీసుకుంటుంది. ధోనీ గురించి బయట ఎంత చర్చ జరుగుతోందో మాకు తెలుసు. అయితే అతని అనుభవం యువ ఆటగాళ్లకు ఇప్పటికీ ఎంతో అవసరం. ఈ సీజన్‌లో అతను ఆడకపోయినా జట్టుపై అతని ప్రభావం చాలా ఎక్కువగా ఉంది" అని పేర్కొన్నారు. అలాగే జట్టులో ఇప్పటికే పలు మార్పులు చేశామని, కొత్త ఆటగాళ్లకు అవకాశాలు ఇచ్చామని ఫ్లెమింగ్ తెలిపారు. కేవలం ఫలితాల ఆధారంగా మాత్రమే జట్టును అంచనా వేయడం సరైంది కాదన్నారు. ధోనీ పాత్రపై తుది నిర్ణయం యాజమాన్యం తీసుకుంటుందని మరోసారి స్పష్టం చేశారు. ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా నిలిచిన మహేంద్ర సింగ్ ధోనీ, చెన్నై జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించారు. అలాంటి ఆటగాడు మళ్లీ మైదానంలో కనిపిస్తాడా లేదా అన్న ఉత్కంఠ ఇప్పుడు అభిమానుల్లో మరింత పెరిగింది.




# కెప్టెన్‌గా కమిన్స్ సరికొత్త రికార్డు

**హైదరాబాద్, మే 19 :** సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో అరుదైన ఘనత సాధించాడు. కెప్టెన్‌గా వ్యవహరిస్తూనే అత్యధిక వికెట్లు పడగొట్టిన పేస్ బౌలర్‌గా కొత్త రికార్డు సృష్టించాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసిన కమిన్స్, ఇప్పటివరకు హార్దిక్ పాండ్యా పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. ఈ ప్రదర్శనతో కమిన్స్‌పై క్రికెట్ వర్గాలు ప్రశంసలు కురిపిస్తున్నాయి. ఈ మ్యాచ్ కమిన్స్‌కు మరో కారణంతో కూడా ప్రత్యేకంగా నిలిచింది. టీ20 క్రికెట్‌లో తన 200 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. అదే సమయంలో కమిన్స్ నాయకత్వంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు చెన్నైపై ఘన విజయం సాధించి ప్లేఆఫ్స్‌లో అధికారికంగా చోటు దక్కించుకుంది. బౌలింగ్‌తో పాటు నాయకత్వంలోనూ కమిన్స్ కీలక పాత్ర పోషించాడని అభిమానులు అభినందిస్తున్నారు. ఐపీఎల్ కెప్టెన్లలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ఆస్ట్రేలియా దిగ్గజ స్పిన్నర్ షేన్ వార్న్ ఇప్పటికీ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయితే పేస్ బౌలర్ల విభాగంలో మాత్రం ప్యాట్ కమిన్స్ ఇప్పుడు నంబర్‌వన్ స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. హార్దిక్ పాండ్యా రెండో స్థానానికి పడిపోయాడు. ప్రస్తుత సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయాల్లో కమిన్స్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. జట్టును సమర్థంగా నడిపిస్తూ బంతితోనూ అద్భుత ప్రదర్శనలు ఇస్తుండటంతో అతని కెప్టెన్సీపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# రాజస్థాన్ సూపర్ విక్టరీ!



## లక్నో సూపర్ జెయింట్స్‌పై 7 వికెట్ల తేడాతో అద్భుత విజయం

## పాయింట్ల పట్టికలో 14 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరిక

ఐపీఎల్ టోర్నీలో రాజస్థాన్ రాయల్స్ అదరగొట్టింది. మంగళవారం జైపూర్ లోని సవాయి మాన్ సింగ్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠ పోరులో లక్నో సూపర్ జెయింట్స్ పై 7 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. భారీ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన రాజస్థాన్ జట్టు ఈ గెలుపుతో ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. పాయింట్ల పట్టికలో నాలుగో స్థానానికి ఎగబాకింది.

**జైపూర్:** సవాయి మాన్ సింగ్ స్టేడియం వేదికగా మంగళవారం 2026 మే 19 న జరిగిన మ్యాచ్ లో టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 220 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్నో బ్యాటర్లలో మిచెల్ మార్ష్ 57 బంతుల్లో 96 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. జోష్ ఇంగ్లిస్ 29 బంతుల్లో 60 పరుగులు, రిషబ్ పంత్ 23 బంతుల్లో 35 పరుగులతో రాణించి జట్టుకు భారీ స్కోరు అందించారు. రాజస్థాన్ బౌలర్లలో యశ్ పుంజా 4 ఓవర్లలో 35 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. జోఫ్రా ఆర్చర్ 4 ఓవర్లలో 39 పరుగులిచ్చి ఒక వికెట్ తీయగా దసున్ షనక ఒక ఓవర్ వేసి 10 పరుగులిచ్చాడు.

### కదంతొక్కిన వైభవ్, జురెల్..

221 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ కు బ్యాటర్లు అద్భుతమైన శుభారంభం అందించారు. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కేవలం 38 బంతుల్లో 93 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. సెంచరీకి చేరువలో అవుటైన వైభవ్ జట్టు విజయానికి గట్టి పునాది వేశాడు. అతనికి తోడుగా ధ్రువ్ జురెల్ 38 బంతుల్లో 53 పరుగులతో అజేయంగా నిలవగా యశస్వి జైస్వాల్ 23 బంతుల్లో 43 పరుగులు చేసి సత్తా చాటాడు. దీంతో రాజస్థాన్ జట్టు 19.1 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 225 పరుగులు చేసి ఘన విజయం సొంతం చేసుకుంది. మరో 5 బంతులు మిగిలి ఉండగానే అలవోకగా లక్ష్యాన్ని చేరుకుంది. లక్నో బౌలర్లలో మోసిన్ ఖాన్ 4 ఓవర్లలో 31 పరుగులిచ్చి ఒక వికెట్, ఆకాశ్ సింగ్ 3 ఓవర్లలో 54 పరుగులిచ్చి ఒక వికెట్ తీశారు. షాబాజ్ అహ్మద్ ఒక బంతి వేసి 6 పరుగులు ఇచ్చుకున్నాడు.

### సజీవంగా ప్లే ఆఫ్స్ ఆశలు..

ఈ అద్భుత విజయంతో రాజస్థాన్ రాయల్స్ ప్లే ఆఫ్స్ రేసులో తన ఆశలను సజీవంగా ఉంచుకుంది. పాయింట్ల పట్టికలో 13 మ్యాచ్ లు ఆడిన రాజస్థాన్ 14 పాయింట్లు సాధించి నాలుగో స్థానానికి చేరుకుంది. తదుపరి మ్యాచ్ లోనూ విజయం సాధిస్తే ప్లే ఆఫ్స్ బెర్త్ ఖాయం చేసుకునే అవకాశం ఉంది. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. ఆ జట్టు 13 మ్యాచ్ లు ఆడి కేవలం 4 విజయాలు, 9 ఓటములతో 8 పాయింట్లు మాత్రమే సాధించి పదో స్థానానికి పరిమితమైంది.





# జట్లను ముంచేసిన నలుగురు కెప్టెన్లు

**హైదరాబాద్, మే 19:** ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో కొన్ని జట్లు కెప్టెన్ల వైఫల్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. భారీ అంచనాలతో సారథ్య బాధ్యతలు చేపట్టిన కొందరు ఆటగాళ్లు బ్యాటింగ్, బౌలింగ్, వ్యూహాల్లో విఫలమవడంతో జట్ల ప్లేఆఫ్స్ ఆశలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్ జట్లు తమ కెప్టెన్ల పేలవ ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కొంటున్నాయి. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టు రిషభ్ పంత్‌పై భారీగా పెట్టుబడి పెట్టి సారథ్య బాధ్యతలు అప్పగించింది. అయితే ఈ సీజన్‌లో అతడు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. బ్యాటింగ్‌లో పరుగులు చేయడంలో విఫలమవడమే కాకుండా, మైదానంలో తీసుకున్న నిర్ణయాలు కూడా జట్టుకు నష్టమే చేశాయి. బ్యాటింగ్ క్రమంలో చేసిన మార్పులు, బౌలర్ల వినియోగంలో తీసుకున్న తప్పుడు నిర్ణయాలు జట్టు ప్రదర్శనపై తీవ్ర ప్రభావం చూపించాయి. దీంతో లఖ్‌నవూ ప్లేఆఫ్స్ రేసు నుంచి తొలిగా నిష్క్రమించిన జట్టుగా నిలిచింది. ఢిల్లీ క్యాపిటల్స్‌కు నాయకత్వం వహిస్తున్న అక్షర్ పటేల్ పరిస్థితి కూడా ఇలాగే మారింది. బ్యాటర్‌గా విఫలమైన అక్షర్, కెప్టెన్‌గా కూడా సరైన ప్రభావం చూపలేకపోయాడు. బౌలింగ్‌లో తనను తాను తక్కువగా వినియోగించుకోవడం, ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లను సరైన సమయంలో ఉపయోగించకపోవడం జట్టుకు నష్టంగా మారింది. కీలక మ్యాచుల్లో ఒత్తిడిని ఎదుర్కోలేక ఢిల్లీ వరుస పరాజయాలు చవిచూసింది. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు అనుభవజ్ఞుడైన అజింక్య రహానే సారథ్యం వహిస్తున్నప్పటికీ, అతడి నెమ్మదైన బ్యాటింగ్ జట్టుపై ఒత్తిడిని పెంచింది. ఆధునిక టీ20 శైలికి తగ్గట్టుగా వేగంగా ఆడలేకపోవడం కేకేఆర్‌కు పెద్ద సమస్యగా మారింది. పవర్‌ప్లేలో వేగంగా పరుగులు చేయలేకపోవడంతో మధ్య ఓవర్లలో జట్టు ఒత్తిడికి గురైంది. రహానే ఫామ్‌పై అభిమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముంబై ఇండియన్స్‌కు హార్దిక్ పాండ్యా సారథ్యం వహించినా, ఈ సీజన్‌లో అతడు పూర్తిగా నిరాశపరిచాడు. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ప్రభావం చూపలేకపోయాడు. సీనియర్ ఆటగాళ్ల వైఫల్యం కూడా జట్టును దెబ్బతీసింది. జట్టులో అంతర్గత విభేదాలు ఉన్నాయనే ప్రచారం కూడా జరుగుతోంది. వరుస ఓటములతో ముంబై ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకోవడంతో హార్దిక్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



# 'సుధీర్ జోకర్' ఫస్ట్‌లుక్ విడుదల

**హైదరాబాద్, మే 19 :** బుల్లితెరపై తన ప్రత్యేకమైన కామెడీ టైమింగ్‌తో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్న సుడిగాలి సుధీర్ ఇప్పుడు హీరోగా వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నాడు. టెలివిజన్ కార్యక్రమాల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన, ప్రస్తుతం వెండితెరపై కూడా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలోనే తాజాగా ఆయన హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'సుధీర్ జోకర్' ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సోమవారం సుడిగాలి సుధీర్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేసింది. విడుదలైన పోస్టర్‌లో సుడిగాలి సుధీర్ చేతిలో ప్లేయింగ్ కార్డ్స్ పట్టుకుని స్టైలిష్‌గా కనిపిస్తున్నాడు. పోస్టర్‌ను బట్టి చూస్తే సినిమాలో ఆయన పాత్ర చాలా విభిన్నంగా, మిస్టరీతో కూడుకున్నదిగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఈ పోస్టర్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ దొంకాడ, శ్రీధర్ మక్కువ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ రియాలిటీ కార్యక్రమం ద్వారా గుర్తింపు తెచ్చుకున్న అయేషా ఈ సినిమాలో కథానాయికగా పరిచయం అవుతోంది. ఈ చిత్రంతో ఆమె వెండితెరకు అడుగుపెడుతుండటంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. సినిమా గురించి చిత్రబృందం మాట్లాడుతూ.. ఇది సాధారణ కథ కాదు, పూర్తిగా మైండ్ గేమ్ ప్రధానంగా సాగే వినోదాత్మక చిత్రం అని వెల్లడించింది. కథలో అనేక ట్విస్టులు, సస్పెన్స్ అంశాలు ఉంటాయని, ప్రేక్షకులను చివరి వరకు ఉత్కంఠకు గురిచేసేలా కథనం సాగుతుందని తెలిపింది. ముఖ్యంగా సుడిగాలి సుధీర్ పాత్ర ఇప్పటివరకు ఆయన చేసిన పాత్రలకంటే పూర్తి భిన్నంగా ఉంటుందని చెప్పారు. ఇప్పటివరకు ఎక్కువగా కామెడీ, వినోదాత్మక షోలతో గుర్తింపు పొందిన సుధీర్ ఈ సినిమాలో నటన పరంగా కొత్త కోణాన్ని చూపించబోతున్నట్లు సమాచారం. మాస్, కామెడీ, థ్రిల్లింగ్ అంశాల కలయికతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. సుధీర్ అభిమానులు కూడా ఈ సినిమాపై మంచి అంచనాలు పెట్టుకున్నారు. ఈ సినిమాలో సీనియర్ నటి అభిరామి కీలక



పాత్రలో నటిస్తుండగా, ప్రముఖ నటులు మురళీశర్మ, అజయ్‌ఘోష్, రమేష్ ఇందిరా తదితరులు ఇతర ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. అనుభవజ్ఞులైన నటీనటులు ఉండటంతో సినిమా కథ మరింత బలంగా ఉండబోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాంకేతిక విభాగం విషయానికి వస్తే.. అహ్మద్ షరీఫ్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. సంగీత దర్శకుడు లియోన్ జేమ్స్ ఈ చిత్రానికి సంగీతాన్ని సమకూరుస్తున్నారు. గ్రామీణ, మాస్, థ్రిల్లింగ్ అంశాలకు తగ్గట్టుగా నేపథ్య సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం చెబుతోంది. ప్రొడక్షన్ డిజైనర్‌గా విఠల్ కోసనం పని చేస్తున్నారు. ఇక 'సుధీర్ జోకర్' అనే టైటిల్ కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. టైటిల్‌ను బట్టి చూస్తే ఇందులో వినోదంతో పాటు మానసిక ఆటలు, మోసాలు, ఊహించని మలుపులు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన టీజర్, విడుదల తేదీ వంటి వివరాలను ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది.



# నేడు ఎన్టీఆర్ బర్త్‌డే

## అర్ధరాత్రికి డ్రాగన్ గ్లింప్స్ విడుదల

యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా చిత్రం నుంచి ఎట్టకేలకు ఒక భారీ అప్‌డేట్ వచ్చేసింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టినరోజు మే 20 పురస్కరించుకుని, మేకర్స్ అభిమానుల కోసం ఒక అద్భుతమైన సర్ప్రైజ్ ప్లాన్ చేశారు. ఈ రోజు అర్ధరాత్రి సరిగ్గా 11:52 గంటలకి ఈ చిత్రం యొక్క ఫస్ట్ గ్లింప్స్ డిజిటల్ ప్లాట్‌ఫార్మ్స్‌తో పాటు, ఎంపిక చేసిన థియేటర్లలో భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో గట్టి టాక్ వినిపిస్తోంది. సెన్సార్ బోర్డ్ వెబ్‌సైట్‌లో కూడా 'గ్లింప్స్ ఆఫ్ డ్రాగన్' పేరుతో సర్టిఫికేట్ పొందినట్లు సమాచారం రావడంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ రాత్రి గ్లింప్స్ ద్వారా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. సాధారణంగా వచ్చే టీజర్లు లేదా గ్లింప్స్‌లు ఒకటి లేదా రెండు నిమిషాలు మాత్రమే ఉంటాయి. కానీ, ప్రశాంత్ నీల్ ఈసారి భిన్నంగా ఏకంగా 4 నిమిషాల 35 సెకన్ల రన్ టైమ్‌తో ఈ గ్లింప్స్‌ను కట్ చేసినట్లు తెలుస్తోంది. సినిమా యొక్క కథా నేపథ్యాన్ని, ఆ ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయడం కోసమే ఇంత సుదీర్ఘమైన విజువల్స్‌ను ప్లాన్ చేశారట. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ హై బడ్జెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలకు ఊపిరి పోసిన రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ క్రేజీ పాన్-ఇండియా విజువల్ వండర్ జూన్ 11, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.





# రష్మిక కామెంట్స్‌తో 'కాక్‌టెయిల్ 2'పై అంచనాలు పెరిగిపోయాయ్!

**ముంబై, మే 19 :** టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీబిజీగా గడుపుతోంది. ఒకవైపు పాన్ ఇండియా సినిమాలతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న ఈ నేషనల్ క్రష్.. ఇప్పుడు హిందీ చిత్ర పరిశ్రమలో కూడా తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతోంది. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్, స్టార్ హీరోయిన్ కృతి సనన్‌లతో కలిసి నటిస్తున్న 'కాక్‌టెయిల్ 2' సినిమా ప్రమోషన్స్‌లో ఆమె ఫుల్ బిజీగా ఉంది. ఈ చిత్రం జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో మేకర్స్ ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా తాజాగా ముంబైలో చిత్రబృందం ఓ గ్రాండ్ మ్యూజికల్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రష్మిక చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సందర్భంగా మాట్లాడిన రష్మిక.. 'కాక్‌టెయిల్ 2' సాధారణ ప్రేమకథ కాదని, ప్రేక్షకుల ఊహలకు అందని విధంగా ఈ సినిమా ఉంటుందని తెలిపింది. "ఈ సినిమా చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఇందులో భావోద్వేగాలు, ప్రేమ, రిలేషన్‌షిప్స్ అన్నీ కొత్త కోణంలో చూపించాం. ప్రేక్షకులు ఈ ప్రేమకథను ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు" అంటూ చెప్పుకొచ్చింది. అలాగే తన సహనటి కృతి సనన్ గురించి మాట్లాడుతూ.. "కృతి మామూలుగానే చాలా హాట్. కానీ ఈ సినిమాలో ఆమె మరింత అందంగా కనిపిస్తుంది. స్క్రీన్‌పై ఆమె ప్రెజెన్స్ అద్భుతంగా ఉంటుంది" అంటూ ప్రశంసలు కురిపించింది. ఇదే సమయంలో హీరో షాహిద్ కపూర్‌తో తన కెమిస్ట్రీ గురించి కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "షాహిద్‌తో మా ఇద్దరి కెమిస్ట్రీ ఓ రేంజ్‌లో ఉంటుంది. ఇప్పటివరకు ట్రైలర్, టీజర్‌లలో మీరు చూసింది చాలా తక్కువ మాత్రమే. అసలు సర్ప్రైజ్‌లు ఇంకా ముందున్నాయి. వాటికోసం మీతోపాటు నేనూ ఎంతో ఎగ్జైటింగ్‌గా ఎదురుచూస్తున్నా" అంటూ అభిమానుల్లో మరింత ఆసక్తి పెంచింది. ఇక 'కాక్‌టెయిల్ 2' సినిమా విషయానికొస్తే.. ఇది ఒక త్రిముఖ ప్రేమకథగా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. ప్రేమ, స్నేహం, భావోద్వేగాల మధ్య జరిగే సంక్లిష్టమైన సంబంధాలను ఈ సినిమాలో చూపించనున్నట్లు సమాచారం. బాలీవుడ్‌లో విభిన్నమైన సినిమాలను తెరకెక్కించే దర్శకుడు హోమీ అదజానియా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో విడుదలైన 'కాక్‌టెయిల్' సినిమా ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే ఫ్రాంచైజీలో వస్తున్న 'కాక్‌టెయిల్ 2'పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా షాహిద్ కపూర్, రష్మిక మందన్న, కృతి సనన్ వంటి స్టార్ కాస్టింగ్ ఈ సినిమాపై హైప్‌ను మరింత పెంచుతోంది. ఇటీవల బాలీవుడ్‌లో కూడా రష్మికకు మంచి డిమాండ్ పెరిగింది. ఇప్పటికే పలు భారీ హిందీ ప్రాజెక్టుల్లో నటిస్తున్న ఆమె.. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ తన మార్కెట్‌ను వేగంగా విస్తరిస్తోంది. 'కాక్‌టెయిల్ 2' విజయవంతమైతే రష్మిక బాలీవుడ్ కెరీర్‌కు ఇది మరింత బూస్ట్ ఇవ్వొచ్చని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# విజయనగరంలో 'కార్పొరేషన్ కురుక్షేత్రం'!

- అదితికి పరీక్ష.. స్వామికి అగ్నిపరీక్ష..!
- మున్సిపల్ ఎన్నికలపై రాజకీయ వేడి





(విజయనగరం ప్రత్యేక ప్రతినిధి)

విజయనగరం కార్పొరేషన్‌లో జరగబోయే ఎన్నికలు ఈసారి కేవలం పార్టీలు మధ్య పోటీగా మిగిలిపోవడం లేదు. ఇది అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతి రాజు రెండేళ్ల పాలనపై ప్రజల తీర్పుగా మారుతుండగా.. మాజీ ఎమ్మెల్యే కొలగట్ల వీరభద్ర స్వామి రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే అగ్నిపరీక్షగా కూడా మారుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కోలగట్ల వీరభద్రస్వామిని ఘోరంగా తిరస్కరించిన విజయనగరం ప్రజలు, అదితి గజపతిరాజుకు చరిత్రలో నిలిచే భారీ మెజారిటీ ఇచ్చారు. అశోక్ గజపతిరాజుకే రాని స్థాయిలో అదితి 62 వేల పైచిలుకు మెజారిటీ సాధించడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే ఇప్పుడు ప్రశ్న ఒక్కటే.. ప్రజలు ఇంత భారీగా గెలిపించిన అదితి రెండేళ్లలో ఏమి సాధించారు? తాత, తండ్రి పేరుకు తగ్గట్టుగా పాలన సాగుతోందా? అభివృద్ధి ఏ స్థాయిలో జరిగింది? ప్రజల్లో ఆమెపై అభిప్రాయం ఎలా ఉంది? ఇవన్నీ రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో తేలనున్నాయి. ఇక కోలగట్ల పరిస్థితి మరింత క్లిష్టంగా కనిపిస్తోంది. గతంలో కార్పొరేషన్ మొత్తం తన ఆధీనంలోకి తెచ్చుకున్న ఆయన.. మేయర్ వ్యవస్థను కూడా తన కనుసన్నల్లో నడిపించారనే విమర్శలు ఎదుర్కొన్నారు. కుమార్తెను డిప్యూటీ మేయర్ చేసి పాలన మొత్తాన్ని కుటుంబ కేంద్రంగా మార్చారనే ఆరోపణలు అప్పట్లో తీవ్రంగా వినిపించాయి. నగరంలో అభివృద్ధి కంటే అక్రమాలే ఎక్కువ జరిగాయనే అభిప్రాయం ప్రజల్లో బలపడిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కార్పొరేటర్లకే అవకాశాలు లేకుండా తండ్రి--కూతురు అన్నీ చుట్టబెట్టేశారనే అసంతృప్తి అప్పట్లో వైసీపీ వర్గాల్లోనే వినిపించింది. అదే కోలగట్ల పరాజయానికి ప్రధాన కారణమైందన్న అభిప్రాయం ఉంది. ఇప్పుడు రాబోయే కార్పొరేషన్ ఎన్నికలు కోలగట్లకు కీలక మలుపుగా మారాయి. కార్పొరేషన్‌ను మళ్లీ తన ఆధీనంలోకి తెచ్చుకోలేకపోతే, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన రాజకీయ భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్పొరేషన్‌ను గెలుచుకుంటే.. కోలగట్ల ప్రభావం పూర్తిగా తగ్గిపోతుందనే చర్చ జోరుగా సాగుతోంది. వైసీపీ తరఫున భవిష్యత్తులో తన కుమార్తెను రాజకీయ వారసురాలిగా నిలబెట్టాలన్న కోలగట్ల ఆలోచనకూ ఈ ఎన్నికలే కీలకంగా మారనున్నాయి. విజయనగరంలో మొదటి నుంచీ పట్టణ ఓటర్లపైనే ఆధారపడిన కోలగట్లకు.. కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడూ బలపరీక్షగానే ఉండేవి. గతంలో ఆ బలంతోనే అన్ని డివిజన్లను కైవసం చేసుకున్న ఆయన.. ఇప్పుడు అదే పట్టణ ప్రజల తీర్పును ఎదుర్కొనబోతున్నారు. అందుకే.. ఈసారి కార్పొరేషన్ ఎన్నికలు కేవలం స్థానిక సంస్థల పోరు కాదు. ఒకవైపు అదితి పాలనకు ప్రజల మార్కులు.. మరోవైపు కోలగట్ల రాజకీయ భవితకు తుది హెచ్చరికగా మారబోతున్నాయి.

# జనసేన నేతపై పోక్సో కేసు కలకలం!

**మైనర్ ఫిర్యాదుతో నరసాపురంలో సంచలనం..**


**రాజకీయ పలుకుబడితో బెదిరింపుల ఆరోపణలు**



**అమరావతి, మే 19:** పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు తీవ్ర కలకలం రేపాయి. జనసేనకు చెందిన స్థానిక నాయకుడు తోట వెంకటరాజు అలియాస్ రాజుపై బాధిత బాలిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు సంచలనంగా మారింది. ఈ వ్యవహారంలో బాలిక తల్లిపైనా ఆరోపణలు రావడం చర్చనీయాంశమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. నరసాపురానికి చెందిన ఓ మహిళతో తోట వెంకటరాజుకు పరిచయం ఏర్పడి, అనంతరం అది అక్రమ సంబంధానికి దారితీసినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మహిళ కుటుంబ వ్యవహారాల్లో అతను జోక్యం చేసుకుంటూ ఆధిపత్యం చెలాయించాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో మహిళ మైనర్ కుమార్తెపై కూడా వేధింపులకు పాల్పడినట్లు బాలిక ఫిర్యాదులో పేర్కొంది. రాజకీయ నాయకులతో తనకు బలమైన పరిచయాలు ఉన్నాయని, పోలీసులు–కోర్టులు ఏమీ చేయలేవంటూ బెదిరింపులకు దిగాడని బాలిక ఆరోపించింది. తన మాట వినకపోతే కుటుంబాన్ని నాశనం చేస్తానని హెచ్చరించాడని వాపోయింది. ఈ వ్యవహారంలో తన తల్లి కూడా ఒత్తిడి తెచ్చిందని, తీవ్ర మానసిక వేదనకు గురిచేసిందని తెలిపింది. వేధింపులు భరించలేక చివరకు స్థానిక పోలీసులను ఆశ్రయించిన బాలిక, తనకు ప్రాణహాని ఉందంటూ రక్షణ కోరింది. అనంతరం మీడియా ముందుకు వచ్చి జరిగిన విషయాలను వెల్లడించింది. తనకు భద్రత కల్పించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. బాధితురాలు మైనర్ కావడంతో పోలీసులు కేసును అత్యంత సీరియస్‌గా తీసుకున్నారు. పోక్సో చట్టంలోని నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసే దిశగా చర్యలు చేపట్టారు. బాలికకు రక్షణ కల్పించి కౌన్సెలింగ్‌కు తరలించారు. పరారీలో ఉన్న తోట వెంకటరాజుతో పాటు అతనికి సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మోకా లక్ష్మిని అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. రాజకీయ పలుకుబడితో మైనర్లపై దారుణాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# దూసుకొస్తున్న 'భారీ మేఘాల దండు'

- పలు రాష్ట్రాలకు హై అలర్ట్!
- బంగాళాఖాతంలో అసాధారణ వాతావరణ మార్పు..
- 6 గంటల్లోనే తీవ్ర వర్షపాతం కురిసే ప్రమాదం



**న్యూఢిల్లీ, మే 19:** భారతదేశ వాతావరణంలో ఊహించని విధంగా ఒక భారీ మార్పు చోటుచేసుకోబోతోంది. దేశాన్ని గడగడలాడించేలా బంగాళాఖాతంలో ఒక అసాధారణ, భయంకరమైన వాతావరణ వ్యవస్థ రూపం దాల్చింది. దాదాపు 3,000 కిలోమీటర్ల పొడవుతో, ఢిల్లీ నుండి చెన్నై దూరం వరకు విస్తరించిన ఒకే ఒక భారీ మేఘాల సమూహం (మాన్‌స్టర్ క్లౌడ్) భూభాగం వైపు దూసుకొస్తోంది. వాతావరణ శాస్త్రంలో దీనిని 'మెసోస్కేల్ కన్వెక్టివ్ సిస్టమ్' లేదా 'స్క్వాల్ లైన్' అని పిలుస్తారు. ఇరాన్, పాకిస్తాన్ మీదుగా ప్రయాణిస్తూ భారత్‌పై విస్తరిస్తున్న తీవ్రమైన పశ్చిమ అల్లకల్లోలం (వెస్టర్న్ డిస్టర్బెన్స్) దీనికి తోడవడంతో రాబోయే రోజుల్లో దేశంలో అత్యంత ప్రాణసంకటమైన పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ వినాశకర వాతావరణ మార్పు వెనుక బలమైన ప్రకృతి శక్తులు పనిచేస్తున్నాయి. బంగాళాఖాతంలోని సముద్రపు నీటి ఉష్ణోగ్రత అసాధారణంగా 31 డిగ్రీల సెల్సియస్ వరకు వేడెక్కడం, దానికి అరేబియా సముద్రం నుండి వీస్తున్న బలమైన తేమ గాలులు తోడవడంతో వందలాది మేఘాలు ఒకదానితో ఒకటి కలిసిపోయి ఈ భారీ వ్యవస్థగా మారాయి. ఈ మేఘాల దండు కేంద్రంలో దాదాపు 15 నుండి 18 కిలోమీటర్ల ఎత్తైన ఒక 'వేడి గోపురం' (హాట్ టవర్) ఏర్పడింది. ఇది ఒక భారీ మేఘాల కర్మాగారంలా పనిచేస్తూ, ప్రతి సెకనుకు 10 టన్నుల నీటిని పైకి పీల్చుకుంటోంది. ఈ ప్రమాదకర వ్యవస్థ కారణంగా కేవలం 6 గంటల వ్యవధిలోనే 200 నుండి 300 మిల్లీమీటర్ల అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఇది కోల్‌కతా వంటి నగరాల్లో ఒక నెల మొత్తం కురిసే వర్షంతో సమానం కావడం గమనార్హం. ఈ రాక్షస మేఘాల కారణంగా దేశవ్యాప్తంగా ఐదు రకాల భయంకరమైన విపత్తులు పొంచి ఉన్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిక్కిం, ఉత్తర బెంగాల్, మేఘాలయ వంటి కొండ ప్రాంతాలలో కేవలం ఒక గంటలోనే 100 మిల్లీమీటర్ల వర్షం కురిసి, 2013 నాటి కేదార్‌నాథ్ తరహా ఘోర మేఘ విస్ఫోటనాలు (క్లౌడ్‌బరస్ట్) సంభవించే ప్రమాదం ఉంది. అలాగే, ఈ వ్యవస్థ గంటకు 20 వేల నుండి 30 వేల వరకు పిడుగులను సృష్టించగలదు. దీనివల్ల ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో 'మెరుపు సునామీ' వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కోల్‌కతా, హౌరా, ఢాకా వంటి నగరాల్లో డ్రైనేజీ వ్యవస్థలు స్తంభించిపోయి, రోడ్లన్నీ నదులుగా మారి ఆకస్మిక వరదలు ముంచెత్తవచ్చు. దీనివల్ల మెట్రో, విమానాశ్రయ సేవలు కూడా నిలిచిపోయే ప్రమాదం ఉంది. మరోవైపు, గంటకు 120 నుండి 150 కిలోమీటర్ల వేగంతో వీచే 'సూపర్ నార్ వెస్టర్స్' భారీ గాలుల కారణంగా ఇళ్ల కప్పులు, కరెంట్ స్తంభాలు, చెట్లు నేలకూలే అవకాశం ఉంది. ఈ తుపాను ప్రభావం వ్యవసాయ రంగంపై కూడా తీవ్రంగా ఉండనుంది. వరి, కూరగాయల పంటలు పూర్తిగా కుళ్ళిపోవడమే కాకుండా, తీర ప్రాంతాల్లోకి సముద్రపు ఉప్పునీరు చేరి భూములు నిరుపయోగంగా మారే ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ అత్యంత కీలకమైన జాగ్రత్తలను జారీ చేసింది. కొండ ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులు తమ ప్రయాణాలను వెంటనే వాయిదా వేసుకోవాలని, వర్షం పడే సమయంలో ప్రజలు పిడుగుల బారిన పడకుండా చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా, సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ప్రాణనష్టాన్ని నివారించాలని ప్రభుత్వం కోరింది.

# కులాలు, మతాల మధ్య చిచ్చుతో రాజకీయం

**జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర**



**మచిలీపట్నం, మే 19:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కులాలు మతాల పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్నారని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో దళితులపై జరిగిన దాడులు మర్చిపోలేనివని చెప్పుకొచ్చారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన దళితుడు సుబ్రహ్మణ్యం నాల్గోవర్ధంతి మచిలీపట్నం బలరామునిపేటలోని ఎస్సీ కాలనీలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ నాయకులు, కాలనీలోని దళిత ప్రముఖులతో మంత్రి కొల్లు రవీంద్ర సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్ హయాంలో ఒక్క దళితులనే కాదని.. బీసీలు, మైనార్టీలు కూడా పెద్దఎత్తున దాడులకు గురయ్యారని మంత్రి కొల్లు రవీంద్ర ప్రస్తావించారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర డ్రైవర్‌గా పనిచేసిన దళితుడు సుబ్రహ్మణ్యంను చంపి శవాన్ని డోర్ డెలివరీ చేశారని ధ్వజమెత్తారు. నాడు ఆ కేసును తారుమారు చేసేందుకు జగన్ అనేక ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కేసును నిష్పక్షపాతంగా విచారిస్తుంటే సాక్షులను ట్యాంపర్ చేసే ప్రయత్నాలు చేశారని చెప్పుకొచ్చారు. మాస్క్ అడిగిన పాపానికి డా. సుధాకర్‌ని పిచ్చోడిని చేసి చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. శాండ్‌లో అవినీతి జరుగుతోందని ప్రశ్నించిన ఓం ప్రకాష్‌ను ఉరివేసి చంపేశారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందని తెలిపారు. జగన్ హయాంలో హత్యకు గురైన బీసీ సోదరుడు తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించామని అన్నారు. నేడు మళ్లీ జగన్ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహించారు. అధికారులకు కులాలు అంటగట్టి దూషిస్తున్నారని మండిపడ్డారు. రోడ్డు ప్రమాదంలో ఓ పాస్టర్ చనిపోతే రాజకీయం చేయాలని చూశారని... వీటన్నింటినీ ప్రజలు గమనించాలని కోరారు. అన్నివర్గాలు సంఘటితమై ముందుకు సాగాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.



# ఏపీలో వెయ్యి మినీ మార్టులు

**తక్కువ ధరలకే సరుకులు : మంత్రి నాదెండ్ల మనోహర్**

**న్యూఢిల్లీ, మే 19:** రాబోయే రోజుల్లో ఏపీలో వెయ్యి మినీ మార్టులు ఏర్పాటు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రెండో రోజు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రానికి చెందిన పలు కీలక అంశాలపై వారితో చర్చించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మినీ మార్టుల ద్వారా మిల్లెట్స్ కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మనోహర్ తెలిపారు. మినీ మార్టులలో మార్కెట్ ధరల కంటే తక్కువకు నాణ్యమైన సరకులు అందజేస్తామన్నారు. మరోవైపు.. అరకు కాఫీని దేశవ్యాప్తంగా అన్ని మిలిటరీ క్యాంటీన్లలో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారని మంత్రి వివరించారు.

# మోడల్ స్కూల్స్‌లో కాంట్రాక్ట్ సిబ్బందికి ఊరట

**కాంట్రాక్ట్‌ను మరో 11 నెలలు పొడిగింపు**

**అమరావతి, మే 19:** ఏపీ మోడల్ స్కూల్స్‌లో కాంట్రాక్ట్ సిబ్బంది సేవలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పొడిగించింది. 123 మంది ఫిజికల్ డైరెక్టర్లు, 120 మంది కంప్యూటర్ టీచర్ల సేవలను పునరుద్ధరించింది. 2026 జూన్ 1వ తేదీ నుంచి 2027 ఏప్రిల్ 30వ తేదీ వరకు 11 నెలల పాటు సేవలకు అనుమతి ఇచ్చింది. అకడమిక్ ఇయర్ 2026-27 కోసం కాంట్రాక్ట్ సిబ్బందికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒక నెల విరామంతో సేవల కొనసాగింపునకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జీఓ ఆర్టీ నంబర్-51ను స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ విడుదల చేసింది. ఈ మేరక్కు ÷నాన్స్ శాఖ అనుమతితో ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# జగన్‌ను కలిసిన దివ్యాంగ ప్రతినిధులు



**అమరావతి, మే 19:** వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్‌ను ఆల్ యూనివర్శిటీ దివ్యాంగ్ వింగ్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం. కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం. శ్రీనివాసరావు కలిసి తమ సమస్యలను వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని 19 యూనివర్శిటీలలో మొత్తం 1523 అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ, దివ్యాంగులకు ఎలాంటి రిజర్వేషన్లు కల్పించలేదని వారు వైయస్ జగన్‌కు తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి, పీహెచ్‌డీలు పూర్తి చేసిన తమలాంటి దివ్యాంగులు రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల హక్కులు, సమానత్వం, సాధికారత కోసం భారత ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాన్ని చంద్రబాబు ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దివ్యాంగులు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను కోల్పోతున్న పరిస్థితి నెలకొన్నదన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో కూడా తమకు తగిన అవకాశాలు ఇవ్వడం లేదని వాపోయారు. దివ్యాంగుల సమస్యలను సావధానంగా విన్న వైయస్ జగన్, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలను గుర్తు చేస్తూ, భవిష్యత్తులో కూడా దివ్యాంగులకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

# దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో నిలిచిన కొనుగోళ్లు

**గుంటూరు, మే 19:** గుంటూరు జిల్లా దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో వ్యాపారులు కుమ్మక్కై కొనుగోళ్లను నిలిపివేశారు. టెండరు ధర ప్రకారం కొనుగోలు చేయాలని వ్యాపారులకు రైతులు, అధికారులు తెల్చి చెప్పారు. దీంతో వ్యాపారులంతా ఏకమై పసుపు కొనుగోలు చేయకుండా వెళ్లిపోయారు. కొనుగోళ్లు నిలిచిపోవడంతో దూర ప్రాంతాల నుంచి పసుపు తీసుకొచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పసుపు ధర బాగుందని, మంచి లాభాలు వస్తాయని ఆశించామని రైతులు చెబుతున్నారు. వ్యాపారుల నిర్వాకంతో పసుపు రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బాగా పండిన పంటను ప్రభుత్వం సూచించిన ధరకు కాకుండా.. తమకు నచ్చిన ధరకు కొనుగోలు చేయాలని వ్యాపారులు చూస్తున్నారని రైతుల ఆరోపిస్తున్నారు.




# భారీగా పెరిగిన బంగారం ధరలు

**హైదరాబాద్, మే 19:** పసిడి ప్రియులకు మరోసారి షాక్ తగిలింది. గత కొన్ని రోజులుగా స్వల్పంగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు నేడు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. ముఖ్యంగా హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం ధర తులానికి రూ.820 పెరగడంతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, డాలర్ మారకం విలువల్లో మార్పులు, పెట్టుబడిదారులు మళ్లీ బంగారం వైపు మొగ్గుచూపడం వంటి కారణాలతో పసిడి ధరలు పెరుగుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. నిన్నటివరకు హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1,56,220 వద్ద ట్రేడ్ కాగా.. తాజాగా అది రూ.820 పెరిగి రూ.1,57,040కు చేరుకుంది. అదే విధంగా 22 క్యారెట్ల బంగారం ధర రూ.750 పెరిగి రూ.1,43,950 వద్ద కొనసాగుతోంది. ఇక 18 క్యారెట్ల బంగారం ధర కూడా రూ.610 పెరిగి రూ.1,17,780కు చేరింది. పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ కొనసాగుతున్న సమయంలో ఈ పెరుగుదల సాధారణ ప్రజలపై అదనపు భారం మోపుతోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు దాదాపు ఇదే స్థాయిలో నమోదయ్యాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,040గా ఉంది. ఢిల్లీలో ఇది రూ.1,57,190గా ఉండగా.. చెన్నై, మధురై, కోయంబత్తూరులో మాత్రం మరింత ఎక్కువగా రూ.1,62,220 వద్ద కొనసాగుతోంది. దక్షిణ భారత నగరాల్లో బంగారం ధరలు అధికంగా ఉండటం గమనార్హం. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. అంతర్జాతీయంగా ఆర్థిక మందగమనం భయాలు, భౌగోళిక ఉద్రిక్తతలు పెరగడం వల్ల పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారాన్ని అధికంగా కొనుగోలు చేస్తున్నారు. దీని ప్రభావం దేశీయ మార్కెట్‌పై కూడా స్పష్టంగా కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో కూడా ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగవచ్చని బులియన్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా వెండి ధరల్లో కూడా స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. బంగారం ధరలు భారీగా పెరగడంతో నగల కొనుగోలు చేయాలనుకునే వారు కొంతకాలం వేచి చూడాలా లేదా ఇప్పుడే కొనాలా అనే సందిగ్ధంలో ఉన్నారు. ముఖ్యంగా పెట్టుబడిగా బంగారం కొనుగోలు చేసే వారు మార్కెట్ పరిస్థితులను గమనిస్తూ ముందడుగు వేయాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# లాభాల్లో మార్కెట్

**ముంబయి, మే 19:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఉదయం లాభాల బాట పట్టాయి. ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే ఇన్వెస్టర్లలో కొనుగోళ్ల ఉత్సాహం పెరగడంతో ప్రధాన సూచీలు గ్రీన్‌లో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ దేశీయ మార్కెట్‌లో సానుకూల వాతావరణం కనిపిస్తోంది. ఉదయం ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 104 పాయింట్లు లాభపడి 23,751 స్థాయి వద్ద ట్రేడ్ అవుతోంది. మరోవైపు సెన్సెక్స్ కూడా 371 పాయింట్లు ఎగబాకి 75,684 మార్క్ వద్ద కొనసాగుతోంది. బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడం మార్కెట్‌కు మద్దతుగా నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల విషయానికి వస్తే.. అమెరికా డాలర్ ఇండెక్స్ ప్రస్తుతం 99.09 పాయింట్ల వద్ద కదలాడుతోంది. ప్రపంచ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 109.8 డాలర్ల వద్ద నమోదైంది. అలాగే అమెరికా 10 ఏళ్ల బాండ్ ఈల్డ్స్ 4.6 శాతం స్థాయిలో కొనసాగుతున్నాయి. ఈ అంశాలు గ్లోబల్ మార్కెట్లలో మిశ్రమ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. గత ట్రేడింగ్ సెషన్‌లో అమెరికా మార్కెట్లు ఒడిదుడుకులకు లోనయ్యాయి. ప్రధాన సూచీ ఎస్ అండ్ పీ 0.07 శాతం నష్టపోగా.. టెక్నాలజీ ఆధారిత నాస్డాక్ సూచీ 0.51 శాతం క్షీణించింది. అయినప్పటికీ భారత మార్కెట్లు మాత్రం కొనుగోళ్ల మద్దతుతో బలంగా నిలిచాయి. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. దేశీయంగా ఆర్థిక వ్యవస్థపై విశ్వాసం కొనసాగుతుండటం, కొన్ని కీలక రంగాల్లో కొనుగోళ్లు పెరగడం వల్ల సూచీలు లాభాల్లో కదులుతున్నాయి. అయితే అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల హెచ్చుతగ్గులు, విదేశీ పెట్టుబడిదారుల ధోరణి మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు.




# మళ్లీ పెరిగిన ఇంధన ధరలు

## వాహనదారులపై మరో భారం




**న్యూఢిల్లీ, మే 19 :** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరిగి వాహనదారులకు షాక్ ఇచ్చాయి. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు లీటర్ పెట్రోల్, డీజిల్‌పై 90 పైసల వరకు ధరలను పెంచాయి. వారం రోజుల వ్యవధిలోనే ఇంధన ధరలు రెండోసారి పెరగడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇటీవలే లీటర్‌కు రూ.3 వరకు ధరలు పెరిగిన నేపథ్యంలో తాజా పెంపు మరింత భారంగా మారింది. దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెరగడంతో కొత్త ధరలు వరుసగా రూ.98.64, రూ.91.58కు చేరాయి. గత శుక్రవారం పెట్రోల్ ధర రూ.94.77 నుంచి రూ.97.77కు, డీజిల్ రూ.87.67 నుంచి రూ.90.67కు పెరిగిన విషయం తెలిసిందే. తాజా పెంపుతో ఇంధన ధరలు మరింత ఎగబాకాయి. ఆర్థిక రాజధాని ముంబైలో లీటర్ పెట్రోల్ ధర రూ.107.59కు చేరుకోగా, డీజిల్ ధర రూ.94.08గా నమోదైంది. కోల్‌కతాలో పెట్రోల్ ధర రూ.109.70కు, డీజిల్ రూ.96.07కు పెరిగింది. చెన్నైలో లీటర్ పెట్రోల్ రూ.104.49, డీజిల్ రూ.96.11 వద్ద విక్రయిస్తున్నారు. ముఖ్యంగా కోల్‌కతాలో పెట్రోల్‌పై అత్యధికంగా 96 పైసల పెంపు నమోదైంది. ముంబైలో పెట్రోల్‌పై 91 పైసలు, డీజిల్‌పై 94 పైసలు పెరిగాయి. చెన్నైలో పెట్రోల్‌పై 82 పైసలు, డీజిల్‌పై 86 పైసలు పెరిగాయి. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. అదే ప్రభావం దేశీయ మార్కెట్‌పై పడుతోందని నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు మరింత పెరిగితే దేశంలో ఇంధన ధరలు ఇంకా పెరిగే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇంధన ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు అధికమయ్యే అవకాశం ఉండటంతో పాటు, నిత్యావసర వస్తువుల ధరలపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ద్రవ్యోల్బణ ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు తాజా పెంపు మరో ఆర్థిక భారంగా మారింది.

# డిజిటల్ రూపాయి

## భారత ఆర్థిక వ్యవస్థలో కొత్త అధ్యాయం



**న్యూఢిల్లీ, మే 19:** భారత రిజర్వ్ బ్యాంక్ ప్రవేశపెట్టిన డిజిటల్ రూపాయి దేశ ద్రవ్య వ్యవస్థలో కీలక మార్పులకు నాంది పలుకుతోంది. సాధారణ కరెన్సీ నోట్లకు డిజిటల్ రూపంగా రూపొందించిన ఈ వ్యవస్థను ఆర్‌బీఐ భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా అభివర్ణిస్తోంది. ఇది క్రిప్టో కరెన్సీ కాదు.. నేరుగా ఆర్‌బీఐ జారీ చేసే అధికారిక డిజిటల్ నగదు కావడం విశేషం. ప్రస్తుతం దేశంలోని పలు ప్రధాన బ్యాంకులు డిజిటల్ రూపాయి వాలెట్ల సేవలను అందిస్తున్నాయి. యూపీఐ తరహా చెల్లింపుల వ్యవస్థలతో పోలిస్తే డిజిటల్ రూపాయి పూర్తిగా భిన్నమని నిపుణులు చెబుతున్నారు. యూపీఐలో బ్యాంకు ఖాతాల మధ్య డబ్బు బదిలీ జరుగుతుండగా.. డిజిటల్ రూపాయిలో మాత్రం ఆర్‌బీఐ జారీ చేసిన డిజిటల్ టోకెన్ల రూపంలో నేరుగా నగదు లావాదేవీ జరుగుతుంది. అందువల్ల ఇది కేవలం పేమెంట్ ప్లాట్‌ఫామ్ కాకుండా డబ్బు స్వరూపాన్నే ఆధునికీకరించే ప్రణాళికగా భావిస్తున్నారు. ఛాయిస్ వెల్త్ పరిశోధన విభాగం అధిపతి అక్షత్ గర్గ్ ప్రకారం డిజిటల్ రూపాయి వల్ల లావాదేవీలు వేగంగా పూర్తవడంతో పాటు సెటిల్‌మెంట్ రిస్కులు తగ్గుతాయి. అలాగే ఆర్థిక వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రోగ్రామబుల్ పేమెంట్స్, ఆఫ్‌లైన్ వినియోగం వంటి ఫీచర్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో కూడా డిజిటల్ చెల్లింపులు వేగంగా విస్తరిస్తాయని అభిప్రాయపడ్డారు. లాంగ్ టెయిల్ వెంచర్స్ వ్యవస్థాపకుడు పరమదీప్ సింగ్ మాట్లాడుతూ.. డిజిటల్ రూపాయిని యూపీఐకి పోటీగా చూడటం సరికాదన్నారు. ఇప్పటికే యూపీఐ ద్వారా భారత్ డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని, అయితే డిజిటల్ రూపాయి లక్ష్యం మరింత విస్తృతమైందని తెలిపారు. భవిష్యత్‌లో మొత్తం చెల్లింపుల వ్యవస్థకు ఇది మౌలిక వేదికగా మారే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఆఫ్‌లైన్ చెల్లింపులు, స్మార్ట్ కాంట్రాక్టులు, వేగవంతమైన క్లియరింగ్ వ్యవస్థలకు ఇది బలమైన ఆధారంగా నిలుస్తుందని చెప్పారు. అలంకిత్ లిమిటెడ్ సీఎఫ్ఓ గౌరవ్ మహేశ్వరి ప్రకారం 2025 మార్చి నాటికి రూ.1,016 కోట్ల విలువైన డిజిటల్ రూపాయి చలామణిలో ఉంది. లక్షలాది వాలెట్లు ఇప్పటికే వినియోగంలో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ పరిమితంగా ఉన్నా ఆఫ్‌లైన్ ఫీచర్ ద్వారా చెల్లింపులు సాధ్యమైతే డిజిటల్ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా డిజిటల్ రూపాయి లావాదేవీలు రూ.34,000 కోట్ల మార్క్‌ను దాటినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. మరిన్ని బ్యాంకులను భాగస్వామ్యం చేస్తూ ఆర్‌బీఐ దీని విస్తరణను వేగవంతం చేస్తోంది. ప్రభుత్వ సబ్సిడీలు, సంక్షేమ పథకాల పంపిణీని మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చే సామర్థ్యం కూడా డిజిటల్ రూపాయికి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే సైబర్ భద్రత, వ్యక్తిగత గోప్యత, ప్రభుత్వ నిఘా వంటి అంశాలపై జాగ్రత్తలు అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ భవిష్యత్ ఆర్థిక వ్యవస్థలో డిజిటల్ రూపాయి కీలక పాత్ర పోషించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# ఏడాది వ్యాలిడిటీతో బీఎస్ఎన్ఎల్ చౌక ప్లాన్




**న్యూఢిల్లీ, మే 19 :** ప్రభుత్వ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ వినియోగదారులను ఆకట్టుకునేందుకు మరో బడ్జెట్ ఫ్రెండ్లీ ప్రీపెయిడ్ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏడాది కాలపరిమితితో అందిస్తున్న ఈ ప్లాన్‌లో రోజుకు 2 జీబీ హైస్పీడ్ డేటాతో పాటు అపరిమిత కాలింగ్ సదుపాయం కల్పిస్తోంది. ప్రైవేట్ టెలికాం సంస్థలతో పోలిస్తే తక్కువ ధరలో ఎక్కువ ప్రయోజనాలు అందిస్తున్న ఈ ప్లాన్ ప్రస్తుతం వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. బీఎస్ఎన్ఎల్ ప్రకటించిన వివరాల ప్రకారం ఈ ప్రత్యేక వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్ ధర రూ.2,399. ఈ ప్లాన్ కింద వినియోగదారులు పూర్తి 365 రోజుల వ్యాలిడిటీ పొందుతారు. దేశవ్యాప్తంగా ఏ నంబర్‌కైనా అపరిమిత ఉచిత కాలింగ్ సదుపాయం అందుబాటులో ఉంటుంది. అలాగే నేషనల్ రోమింగ్ కూడా పూర్తిగా ఉచితంగా లభిస్తుంది. డేటా ప్రయోజనాల విషయానికి వస్తే ప్రతిరోజూ 2 జీబీ హైస్పీడ్ డేటా అందించనున్నారు. మొత్తం ఏడాది కాలంలో 730 జీబీ డేటా వినియోగించే అవకాశం ఉంటుంది. అదనంగా రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు కూడా లభిస్తాయి. ఎక్కువ కాలం వ్యాలిడిటీతో చౌకగా ప్లాన్ కోరుకునే వినియోగదారులకు ఇది మంచి ఎంపికగా మారనుందని టెలికాం వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్‌కేర్ యాప్ లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా రీఛార్జ్ చేసుకునే వారికి సంస్థ 5 శాతం వరకు తగ్గింపును కూడా అందిస్తోంది. దీంతో వినియోగదారులు అదనంగా రూ.200 వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంటుంది. ఇక ఇతర దీర్ఘకాలిక ప్లాన్‌ల విషయానికి వస్తే బీఎస్ఎన్ఎల్ రూ.1,499 మరియు రూ.2,799 ధరల్లో కూడా ప్రత్యేక వార్షిక ప్లాన్‌లను అందిస్తోంది. రూ.1,499 ప్లాన్ 330 రోజుల వ్యాలిడిటీతో వస్తుండగా, రూ.2,799 ప్లాన్ పూర్తి 365 రోజుల కాలపరిమితిని కలిగి ఉంటుంది. ప్రత్యేకంగా రూ.2,799 ప్లాన్‌లో రోజుకు 3 జీబీ డేటా, అపరిమిత కాలింగ్, దేశవ్యాప్తంగా ఉచిత నేషనల్ రోమింగ్‌తో పాటు రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు కూడా లభిస్తాయి. అధిక డేటా వినియోగం చేసే వినియోగదారులకు ఈ ప్లాన్ మరింత ప్రయోజనకరంగా ఉంటుందని కంపెనీ చెబుతోంది. ప్రైవేట్ టెలికాం సంస్థలు వరుసగా టారిఫ్ ధరలు పెంచుతున్న నేపథ్యంలో తక్కువ ధరలో ఎక్కువ వ్యాలిడిటీ, అధిక డేటా అందిస్తున్న బీఎస్ఎన్ఎల్ ప్లాన్‌లు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి.

# క్రెడిట్ కార్డు వినియోగం జోరు




**ముంబై, మే 19:** దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో క్రెడిట్ కార్డు లావాదేవీలు కూడా రికార్డు స్థాయిలో పెరిగినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. 2021 నుంచి 2025 మధ్యకాలంలో క్రెడిట్ కార్డు ద్వారా జరిగిన లావాదేవీలు ఏకంగా 2.6 రెట్లు పెరిగినట్లు తాజా పేమెంట్ సిస్టమ్ నివేదికలో పేర్కొంది. ఆర్‌బీఐ వివరాల ప్రకారం.. 2021లో దేశవ్యాప్తంగా 216 కోట్ల క్రెడిట్ కార్డు లావాదేవీలు నమోదయ్యాయి. అయితే 2025 నాటికి ఈ సంఖ్య 570 కోట్లకు చేరుకుంది. విలువ పరంగా చూస్తే 2021లో రూ.8.9 లక్షల కోట్లుగా ఉన్న లావాదేవీలు.. 2025 నాటికి రూ.23.2 లక్షల కోట్లకు పెరిగాయి. అంటే సగటున ప్రతి ఏడాది 27 శాతం వృద్ధి నమోదైనట్లు నివేదిక వెల్లడించింది. మరోవైపు డెబిట్ కార్డు వినియోగం మాత్రం గణనీయంగా తగ్గినట్లు ఆర్‌బీఐ తెలిపింది. 2021లో 408.7 కోట్లుగా ఉన్న డెబిట్ కార్డు లావాదేవీలు 2025 నాటికి 133.6 కోట్లకు పడిపోయాయి. విలువ పరంగా కూడా 2021లో రూ.7.4 లక్షల కోట్లుగా ఉన్న లావాదేవీలు.. 2025 నాటికి రూ.4.5 లక్షల కోట్లకు తగ్గిపోయాయి. యూపీఐ, క్రెడిట్ కార్డుల వినియోగం పెరగడం వల్ల డెబిట్ కార్డుల ప్రాధాన్యం క్రమంగా తగ్గుతోందని నిపుణులు చెబుతున్నారు. క్రెడిట్ కార్డు మార్కెట్‌లో ప్రైవేట్ రంగ బ్యాంకుల ఆధిపత్యం మరింత బలపడినట్లు నివేదిక వెల్లడించింది. 2021లో 67.7 శాతంగా ఉన్న ప్రైవేట్ బ్యాంకుల క్రెడిట్ కార్డు వినియోగం 2025 చివరినాటికి 71.1 శాతానికి పెరిగింది. మరోవైపు ప్రభుత్వరంగ బ్యాంకుల వాటా మాత్రం 23.5 శాతం నుంచి 23.9 శాతానికి మాత్రమే పెరిగింది. డిజిటల్ లావాదేవీలపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన, ఈఎంఐ సౌకర్యాలు, రివార్డ్ పాయింట్లు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు వంటి అంశాలు క్రెడిట్ కార్డు వినియోగాన్ని వేగంగా పెంచుతున్నాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ షాపింగ్, ట్రావెల్, ఫుడ్ డెలివరీ, సబ్‌స్క్రిప్షన్ సేవల్లో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగినట్లు చెబుతున్నారు.